www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 21 ఏప్రిల్ 2024
8 పేజీలు

ఏలూరు పశ్చిమ గోదావరి

చింతలపూడి : నామినేషన్ వేస్తున్న విజయరాజు

డిఆర్ఒకు నామినేషన్ పత్రాన్ని అందిస్తున్న నాగేంద్ర కృష్ణ

కొనసాగిన నామినేషన్ల పర్వం

నామినేషన్ల పర్వం మూడో రోజు మందకొడిగా సాగింది. ప్రధాన పార్టీల తరఫున ఒకరు మినహా ఎవరూ నామినేషన్లు వేయలేదు. సోమవారం, బుధ, గురువారాల్లో పెద్దసంఖ్యలో నామినేషన్లు దాఖలయ్యే అవకాశం ఉందని ప్రచారం సాగుతోంది.

ఏలూరు జిల్లాలో అసెంబ్లీకి మరో 9 నామినేషన్లు

పశ్చిమలో ఎంపీకి ఒకటి, అసెంబ్లీకి నాలుగు

నామినేషన్ల ప్రక్రియకు నేడు సెలవు

ప్రజాశక్తి - ఏలూరు, భీమవరం

ఏలూరు జిల్లాలో శనివారం అసెంబ్లీ నియోజకవర్గాలకు తొమ్మిది నామినేషన్లు దాఖలయ్యాయి. ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి ఒక్క నామినేషన్ కూడా దాఖలవ్వలేదు. అసెంబ్లీ నియోజకవర్గాలకు తొమ్మిది నామినేషన్లు వచ్చాయి. ఉంగుటూరులో స్వతంత్ర అభ్యర్థి పుట్టా కుమార్, ఏలూరులో జై భారత్ నేషనల్ పార్టీ అభ్యర్థిగా ములగల జోషిల, కైకలూరులో ఆలిండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థిగా లావేటి వీరశివాజీ నామినేషన్లు వేశారు. నూజివీడులో నియోజకవర్గానికి రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా అభ్యర్థిగా పాము రవీంద్రనాథ్, ఇండిపెండెంట్ అభ్యర్థిగా ముద్దరబోయిన వెంకటేశ్వరరావు, పోలవరంలో గోండ్వానా దండకారణ్య పార్టీ అభ్యర్థిగా మడకం వెంకటేశ్వరరావు, చింతలపూడిలో వైసిపి అభ్యర్థులుగా కంభం విజయరాజు, కంభం సామ్యూల్ ప్రణయ్ తేజ, ఇండిపెండెంట్ అభ్యర్థిగా దుర్గారావు వెంప నామినేషన్లు సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అందజేశారు. దెందులూరు నియోజకవర్గంలో శనివారం నామినేషన్లు దాఖలు కాలేదు.

భీమవరం: సార్వత్రిక ఎన్నికల నామినేషన్ల పర్వం శనివారం కూడా కొనసాగింది. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో భాగంగా మూడో రోజు ఎంపీ స్థానానికి ఒకటి, అసెంబ్లీ స్థానాలకు నాలుగు నామినేషన్లు దాఖలయ్యాయి. నరసాపురం ఎంపీ స్థానానికి జై భీమ్‌రావు భారత్ పార్టీ అభ్యర్థిగా తణుకుకు చెందిన ఓలేటి నాగేంద్ర కృష్ణ ఒక సెట్ నామినేషన్ దాఖలు దాఖలు చేశారు. నరసాపురం పార్లమెంటరీ నియోజకవర్గ సహాయ రిటర్నింగ్ అధికారి, డిఆర్ఒ జె.ఉదయభాస్కరరావుకు నాగేంద్ర కృష్ణ నామినేషన్ పత్రాన్ని అందజేశారు. పాలకొల్లు అసెంబ్లీ స్థానానికి పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పోలిశెట్టి శివకృష్ణ నామినేషన్ వేశారు. తాడేపల్లిగూడెం స్థానానికి రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎ) అభ్యర్థిగా మరపట్ల రాజు, తణుకు స్థానానికి స్వతంత్ర అభ్యర్థులుగా సజ్జ మురళీకృష్ణ, పుప్పల కుమారి ఒక్కో సెట్ చొప్పున నామినేషన్లు దాఖలు చేశారు. మిగిలిన భీమవరం, నరసాపురం, ఆచంట, ఉండి నియోజకవర్గాల్లో ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు. ఈ నెల 18 నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైన నాటి నుంచి నరసాపురం ఎంపీ స్థానానికి ఆరుగురు అభ్యర్థులు ఎనిమిది సెట్లు నామినేషన్లు, ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 25 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి సుమిత్ కుమార్ ప్రకటించారు.

ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలి

కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో మే 13న జరగబోయే సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఏలూరు జిల్లాలోని ప్రతిఒక్క ఓటరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ తెలిపారు. ప్రతి ఓటరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లూ చేశామన్నారు. ఈ ఎన్నికల్లో 85 సంవత్సరాలు నిండిన సీనియర్ సిటిజన్లు, విభిన్నప్రతిభావంతులు, సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగు సిబ్బంది, ఇతర ఎన్నికల విధులకు హాజరయ్యే సిబ్బంది, పోలీస్ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు, క్లీనర్లు, అత్యవసర సేవలందించే వివిధ శాఖలకు చెందిన సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్ ద్వారా ప్రత్యేక సౌకర్యం కల్పించామన్నారు.

ఎన్నికల వ్యయాన్ని ఖచ్చితత్వంతో లెక్కించాలి

వ్యయ పరిశీలకులు పీయూష్ శుక్లా

ఎన్నికలపై సమీక్షిస్తున్న శుక్లా

ప్రజాశక్తి - ఉండి

ఎన్నికల ప్రచారానికి పరిమితికి మించి వెచ్చించే అవకాశం ఉన్న ఆయా అభ్యర్థుల ఖర్చులపై నిరంతరం నిఘా ఉంచాలని నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు పీయూష్ శుక్లా సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక తహాశీల్దారు కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి ఛాంబర్‌లో సార్వత్రిక ఎన్నికల్లో ఉండి అసెంబ్లీ నియోజకవర్గం నుండి పోటీచేసే అభ్యర్థుల వ్యయాలపై నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ వ్యయ పరిశీలకులు సీయూష్ శుక్లా, ఉండి నియోజకవర్గ రిటర్నింగు అధికారి, జిల్లా జాయింటు కలెక్టరు సివి.ప్రవీణ్ ఆదిత్యతో సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా నరసాపురం పార్లమెంటు వ్యయ పరిశీలకులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల వ్యయాల వివరాలను పక్కాగా లెక్కించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి అని, అనుమతి లేకుండా చేసే వాటిని కూడా పరిశీలించి ఎన్నికల వ్యయంలోకి తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పలువురు అధికారుల సందేహాలను పీయూష్‌శుక్లా నివృత్తి చేశారు. ఈ సమీక్షా సమావేశంలో ఉండి నియోజకవర్గ తహసీల్దార్లు, ఉండి ఎంపిడిఒ రవీంద్ర, ఎన్నికల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిఎల్ఐ సమస్యలు పరిష్కరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి

జిఎల్ఐ ఉపసంచాలకులకు వినతి పత్రం అందిస్తున్న యుటిఎఫ్ నేతలు

ప్రజాశక్తి - భీమవరం

ఎపి ప్రభుత్వ బీమా పథకంలో ఉన్న ఉపాధ్యాయుల బీమా పాలసీ పథకంలో మిస్సింగ్ క్రెడిట్స్‌ను సరిచేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల జిఎల్ఐ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిఎల్ఐ ఉపసంచాలకులకు యుటిఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడారు. బీమా పథకంలో అదనపు బాండ్ కోసం ప్రీమియం చెల్లించిన వారికి కొత్త బాండ్ జనరేట్ చేసి ఇవ్వాలన్నారు. ఫైనల్ సెటిల్‌మెంట్ చెల్లించాలని కోరారు. ఎపి జిఎల్ఐ లోన్స్ పెట్టుకున్న వారికి వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లోన్స్ రికవరీ అయినా కూడా రికవరీ కానట్లు చూపించడం దారుణమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులు పి.జయకర్, పిఎస్.విజయ రామరాజు, పశ్చిమ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎకెవి.రామభద్రం, జిల్లా నాయకులు కె.శ్రీదేవి, రామయ్య, శివప్రసాద్, రత్నరాజు, కెవి.సత్యనారాయణ ఉన్నారు.

ప్రముఖుల ఖిల్లా.. భీమవరం

మధ్యపేజీల్లో..

క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలి

8లో..

ఇండియా వేదికతోనే అభివృద్ధి

8లో..

నేడు నరసాపురం, భీమవరంలో పవన్ సభలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

నామినేషన్ల పర్వం ఊపందుకుంటున్న తరుణంలో వివిధ పార్టీల అధినేతలు తమ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. దీనిలో భాగంగా జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆదివారం పశ్చిమగోదావరి జిల్లాలో పర్యటించనున్నారు. ఆయన హెలీకాప్టర్‌లో నరసాపురం చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం నరసాపురం నుంచి మత్స్యపురి, తాడేరు మీదుగా భీమవరం చేరుకుని అక్కడ ఏర్పాటు చేసిన సభలో పాల్గొని ప్రసంగించనున్నారు. అనంతరం రాత్రికి భీమవరంలోనే బస చేయనున్నారు. ఇటీవలే భీమవరంలో సిఎం జగన్ 'మేమంతా సిద్ధం' సభలో ప్రసంగించిన సంగతి తెలిసిందే.

23న 'సంక్షోభంలో భారత్ ఆర్థిక, రాజకీయ మూలాలు'పై సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం

అఖిల భారత న్యాయవాదుల సంఘం (ఐలు), లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ మంగళవారం సంక్షోభంలో భారత్, ఆర్థిక, రాజకీయ మూలాలు అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు ఐలు జిల్లా ఉపాధ్యక్షుడు పూరిళ్ల శ్రీనివాస్ తెలిపారు. స్థానిక అల్లూరి సత్యనారాయణరాజు సాంస్కృతిక కేంద్రంలో జరిగే ఈ సదస్సులో ప్రముఖ ఆర్థిక, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పరకాల ప్రభాకర్ ప్రధాన వక్తగా పాల్గొంటారని ఆయన వివరించారు. సదస్సు సాయంత్రం 4 గంటలకు జరుగుతుందని తెలిపారు.. సదస్సులో ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎంఎల్‌సి ఇళ్ల వెంకటేశ్వరరావు, ఐలు రాష్ట్ర గౌరవాధ్యక్షులు దిగుపాటి రాజగోపాల్ తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సులో అందరూ పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

వీధి దీపాలకు మరమ్మతులు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వడాలి గ్రామ సచివాలయం బజార్‌లో కొంతకాలంగా నిరంతరాయంగా పట్టపగలు వెలుగుతున్న వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. శుక్రవారం ప్రజాశక్తిలో 'పట్టపగలే విద్యుత్ కాంతులు' అనే శీర్షికతో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో వెంటనే స్పందించిన పంచాయతీ కార్యదర్శి జి.రమేష్ శుక్రవారం వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. దీంతో సమస్య పరిష్కారమైంది.

ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు సమీపంలోని ఆటపాకలో ఆదివారం సాయంత్రం జరగనున్న గౌడ, శెట్టిబలిజ ఆత్మీయ సమావేశాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర గౌడ సంఘం వైస్ ప్రెసిడెంట్ పోసిన చెంచు రామారావు కోరారు. శనివారం ముదినేపల్లిలోని సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం వద్ద జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సభకు ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ముదినేపల్లి నుంచి భారీ ర్యాలీతో ఆటపాక సభ వేదిక వరకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా రాష్ట్ర మంత్రి జోగు రమేష్‌తో పాటు పలువురు రాష్ట్ర గౌడ సంఘం నాయకులు పాల్గొంటారన్నారు. నియోజకవర్గం నుంచి గౌడ, శెట్టిబలిజలు అత్యధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమం విజయవంతం చేయవలసిందిగా కోరారు. ఈ సమావేశంలో ఈడే వెంకటేశ్వరరావు, శొంఠి కుమార్ స్వామి, జోగి సురేష్, బొర్రా శేషు, బత్తిని కిషోర్, శొంఠి నాగరాజు, మరీదు రాధా, కట్టా మహేష్, వీరమల్ల కొండలరావు పాల్గొన్నారు.

ప్రతి ఓటూ కీలకమే

టిడిపి అధ్యక్షులు సత్యనారాయణ

ప్రజాశక్తి - ద్వారకా తిరుమల

రాబోయే ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమేనని టిడిపి మండల అధ్యక్షులు లంక సత్యనారాయణ అన్నారు. ఎన్నికలకు కేవలం 20 రోజులు మాత్రమే సమయం ఉంది, కాబట్టి ప్రతి గ్రామంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలుపుకొని ఇంటింటా ప్రచారం ఉధృతం చేయాలని అన్నారు. ప్రతి ఇంటికీ కరపత్రాలు వెళ్లేలా చూడాలన్నారు. గోపాలపురం నియోజకవర్గంలో ద్వారకాతిరుమల మండలం ప్రత్యేకమైన స్థానం సంపాదించుడానికి మన అందరి కృషి చాలా అవసరం కాబట్టి ప్రతి ఒక్కరూ ఇంటింటా ప్రచారాన్ని ముమ్మరం చేయాలని తెలిపారు. ప్రతి ఓటు మనకు కీలకమే కాబట్టి అందరూ కలిసి ముందుకు సాగుదామని అన్నారు.



ప్రచార కార్యక్రమంలో పార్థసారధి

'చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి'

టిడిపి ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కావాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావాలని టిడిపి నూజివీడు నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ముసునూరు మండలం చిల్లబోయినపల్లి గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పార్థసారథి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం, ప్రజాస్వామ్య పరిరక్షణ ఎన్‌డిఏ కూటమితో మాత్రమే సహకారం అవుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి

ప్రజల వేడుకోలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం టౌన్

జంగారెడ్డిగూడెం పరిధిలోని చుట్టుపక్కల సుమారు 50, 60 గ్రామాల నుంచి పనుల నిమిత్తం జంగారెడ్డిగూడెం పట్టణానికి వేల సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగిస్తూ ఉంటారని, వారికి దాహం తీర్చే నాధుడే లేడని ప్రజలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. ఈ వేసవిలో మండుటెండల్లో చిన్నపిల్లలతో హాస్పిటల్ పనిమీద, ఇంకా ఇతర పనుల మీద రాకపోకలు సాగిస్తూ ఉంటారు. పనుల నిమిత్తం వస్తున్న ప్రజలకు జంగారెడ్డిగూడెం పట్టణంలో కనీసం వేసవి దాహం తీర్చే నాధుడే లేడని ప్రజలు ఆవేదన వక్తం చేస్తున్నారు. పట్టణ, ప్రధాన ప్రదేశాలలో చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తిని తీర్చే అవసరం ఎంతైనా ఉందని వారు వేడుకుంటున్నారు. ప్రధాన ప్రదేశాలైనటువంటి బస్టాపు, హాస్పిటల్స్, షాపింగ్ కాంప్లెక్స్ దగ్గర చలివేంద్రాలు ఏర్పాటు చేసి, ప్రజల దాహార్తిని తీర్చాలని, తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడాల్సి వస్తుందని, తగిన నీటి వసతిని కల్పించి సమస్యలు పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర ఎండలో ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు

బిఎండి ఛానల్‌కు తాగునీరు విడుదల

ప్రజాశక్తి - ముదినేపల్లి

ఎట్టకేలకు అధికారులు మండలంలోని బిఎండి ఛానల్‌కు తాగునీరు విడుదల చేశారు. శుక్రవారం రాత్రి బంటుమిల్లి ప్రధాన కాలువ నుంచి తాగునీటిని విడుదల చేశారు. ప్రస్తుతం నీరు ముదినేపల్లి మండలంలో ప్రవేశించింది. ఈ ఛానల్ పరిధిలో వాడవల్లి, వి.రావిగుంట, వణుదుర్రు, దేవపూడి, ఊటుకూరు, నారాయణపురం గ్రామాల మంచినీటి చెరువులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ చెరువుల్లో నీరు అడుగంటడంతో ఆయా గ్రామాల్లో నీటి ఎద్దడి నెలకొంది. నీటి సమస్య తీవ్ర రూపం దాల్చడంతో జల వనరుల శాఖ అధికారులు బిఎండి ఛానల్‌కు తాగునీటిని విడుదల చేశారు. ఈ ఛానల్‌కు విడుదల చేసిన నీరు ఆదివారం సాయంత్రానికి కాలువ శివారు గ్రామాలకు చేరుకునే అవకాశం ఉంది. ఛానల్‌కు నీరు విడుదల చేయడంతో మంచినీటి చెరువులు నింపుకునేందుకుగాను ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు కాలువ గట్లపై ఆయిల్ ఇంజన్‌లను ఏర్పాటు చేసే పనుల్లో నిమగ్నమయ్యారు.



బిఎండి ఛానల్‌లో ప్రవహిస్తున్న నీరు

అధికారం కోసం కాదు.. ఆత్మగౌరవంపై పోరాటం

కాంగ్రెస్ ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమాట్ల ఎలిజా

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ ప్రజలంతా చూస్తున్నారని, అధికారం కోసం పోటీ పడటం లేదు.. ఆత్మగౌరవంపై పోరాటం చేస్తున్నానని కాంగ్రెస్ చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి ఉన్నమాట్ల ఎలిజా అన్నారు. లింగపాలెం మండలం ధర్మాజీగూడెం మోడల్ కాలనీలో శనివారం ఆయన ఇంటింటికీ ప్రచారం కార్యక్రమం నిర్వహించారు. కాలనీ వాసులు ఆయనకు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు. వైఎస్.రాజశేఖర్ రెడ్డి, హస్తం గుర్తు వేషధారణలతో ప్రచారం జోరుగా సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు కాంగ్రెస్‌లోనే న్యాయం జరుగుతుందని అన్నారు. అందరినీ ఆదరించే కాంగ్రెస్ పార్టీని హస్తం గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగుదారుల పట్టాల అందజేతకు కృషి

మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన

ప్రజాశక్తి - ముసునూరు

హామీలు ఇచ్చి మభ్యపెట్టడం తనకు చేతకాదని, తనకు అధికారం ఇస్తే నూజివీడు నియోజకవర్గంలో పరిష్కారం కాకుండా ఉన్న భూ సమస్యలను పరిష్కరించి సాగుదారులకు పట్టాలు అందేలా కృషి చేస్తానని మాజీ ఎంఎల్ఎ ముద్దరబోయిన వెంకటేశ్వరరావు అన్నారు. శనివారం నూజివీడు మండలం వెంకటాయపాలెం, ఒగిరాలతండా, కొత్తూరుతండా గ్రామాలలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీల తరపున పోటీ చేసినప్పుడు, నూజివీడు నియోజకవర్గం అభివృద్ధి చేసే క్రమంలో అనేక అవరోధాలు ఉంటాయని, అదే స్వతంత్ర అభ్యర్థిగా గెలిచిన సందర్భంలో రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో నూజివీడు నియోజకవర్గంలో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని తాను స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నానన్నారు. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన నూజివీడు నియోజకవర్గం గత పది సంవత్సరాలుగా ప్రతి ఇంటి గడప తొక్కానని, ప్రతి ఇంటి సమస్యలు తనకు తెలుసన్నారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వడం ద్వారా వారికి ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. గ్రామాలలో తాగునీరు, రహదారుల కల్పన, డ్రెయినేజీ వ్యవస్థ మెరుగుదల వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రధానంగా దృష్టి సారిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

సూపర్ సిక్స్ పథకాలపై ప్రచారం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఏలూరు 47వ డివిజన్ ఇజ్రాయేల్ పేటలో శనివారం ఉదయం నిర్వహించిన ప్రజా సంకల్పయాత్రలో బడేటి చంటి పాల్గొన్నారు. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రతిఒక్కరినీ ఆప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలు తెలుసుకున్నారు. కూటమి అధికారంలోకి వస్తే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా బడేటి చంటి మాట్లాడుతూ జగన్ చేతకాని పాలనతో ప్రజా జీవితాలు తలకిందులు అయ్యాయని ఆందోళన వ్యక్తం చేశారు. కూటమికి వస్తోన్న ప్రజాదరణను చూసి ఓర్వలేక వైసిపి నాయకులు విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. కూటమి అధికారంలోకి రాగానే గ్యారెంటీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇప్పటి వరకు ఏలూరు నగరంలోని 50 డివిజన్లలో 85 శాతం ప్రజలను కలిశానని చెప్పారు. ఎండల్లో కూడా తన పట్ల ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు మరువలేనివని, వారి రుణం తప్పకుండా తీర్చుకుంటానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిడిపి నగర అధ్యక్షుడు పెద్దిబోయిన శివప్రసాద్, జనసేన నగర అధ్యక్షులు నాగిరెడ్డి కాశీ నరేష్, డివిజన్ కార్పొరేటర్ వందనాల దుర్గాభవాని, టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న మానవత సభ్యులు

మానవత ఆధ్వర్యాన మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల కేంద్రంలో వినాయకుడి సెంటర్ వద్ద మానవత మండల శాఖ ద్వారా పది లీటర్ల మజ్జిగను వాహనదారులకు, బాటసారులకు పంపిణీ చేశారు. ఎండవేడిమితో ఇక్కట్లు పడుతున్న ప్రజలు మజ్జిగ పంపిణీతో కొంత ఉపశమనం పొందారు.

టిడిపిలోకి పలువురు

ప్రజాశక్తి - కామవరపుకోట

మండలంలో మాజీ ఎంఎల్ఎ ఘంటా మురళీ రామకృష్ణ సోదరుడు ఘంటా సత్యంబాబు ఆధ్వర్యాన 200 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, టిడిపి ఏలూరు పార్లమెంటు అభ్యర్థి పుట్ట మహేష్ యాదవ్, టిడిపి చింతలపూడి నియోజకవర్గ అభ్యర్థి సొంగ రోషన్ కుమార్, మాజీ ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్, పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

REVU VEERLA VENKAMMA అను నాకు విశాఖపట్నం పాస్‌పోర్టు కార్యాలయం అధికారులు ది.26-07-2018న S3806062 నెంబరు గల పాస్‌పోర్టు మంజూరుచేసారు. సదరు పాస్‌పోర్టు జిరాక్స్ కాపీలు తీయించుకునేందుకు ది.10-04-2024న మా ఇంటి నుండి మొగల్తూరు గ్రామం మెయిన్‌రోడ్‌కు వెళ్ళుండగా నా ఒరిజినల్ పాస్‌పోర్టు పోయినది. గాన నా పాస్‌పోర్టు ఎవరికైనా దొరికిన యెడల ఈ క్రింది చిరునామాకు అందించగలరని కోరుచున్నాను.

REVU VEERLA VENKAMMA
W/o. Revu Padma Rao
D.No.6-2-113, Kalipatnam, Pathapadu Post
Mogaltur Mandal, W.G.Dt. A.P.

CHANGE OF SUR-NAME

I, RANGINEEDI VENKATA SUBBA RAO S/o. Rangineedi Narasimha Rao, D.No. 17-1-157, Sri Gogulamma Temple Street, Rustumbada, Narasapur, Narasapur Mandal, W.G.Dt. A.P., I have changed my Sur- name from RANJIVEEDI VENKATA SUBBA RAO (Old name) to RANGINEEDI VENKATA SUBBA RAO (New name) hence forth I am being called RANGINEEDI VENKATA SUBBA RAO S/o. Rangineedi Narsimha Rao, for all purposes.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 47/2014

పిటీషన్:
శ్రీ లక్కాకుల సత్యనారాయణ (మరణించినారు)
మరియు కొందరు
... వాదులు

మరియు

శ్రీ లక్కాకుల సూర్యచంద్రరావు మరియు కొందరు
.... ప్రతివాదులు

10వ ప్రతివాది :
శ్రీ లక్కాకుల దుర్గాప్రసాద్ తండ్రి: జగదీశ్వరనారాయణ, మాధవరం, తాడేపల్లి గూడెం మండలం,పశ్చిమగోదావరి జిల్లా.

పై నెంబరు దావాలో మీపై వాదులు దాఖలు చేసిన దావాలో ఎన్ని పర్యాయములు సమన్లు పంపించినప్పటికీ మీరు తీసుకొనని కారణంగా శ్రీ కోర్టువారు పేపరు పబ్లికేషన్ ద్వారా సమన్లు అమలు నిమిత్తం వాయిదా వేసియున్నారు. వాయిదా తేది: 26/04/2024న అయి వున్నది. ఆ రోజు ఉదయం మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవలెను లేని యెడల మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

వాయిదా తేది: 26-04-2024
ముద్దన శ్రీనివాసరావు,
అడ్వకేట్, తాడేపల్లిగూడెం.

ముఖ్య వార్తలు

ఆదివారం 21 ఏప్రిల్ 2024

ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలో ఉపాధి హామీ చట్టం పనులు ముమ్మరంగా జరుగుతున్నట్లు ఎపిఒ బి.నాగరాజు శనివారం తెలిపారు. మండల వ్యాప్తంగా 30 గ్రామ పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ చట్టం పనులు ముమ్మరంగా జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పంట బోదెల్లో కూలీలు పూడికతీత పనులు చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా శనివారం 3,352 మంది కూలీలు ఉపాధి హామీ పథకం పనుల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.

వేసవిలో జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగస్తులు ప్రస్తుత వాతావరణ పరిస్థితుల దృష్ట్యా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని, ఈ తీవ్ర ఉష్ణోగ్రతల నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై మెడికల్ క్యాంపు నిర్వహిస్తున్నామని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ తెలిపారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తం కుమార్ ఆధ్వర్యంలో శనివారం స్థానిక న్యాయ సేవాధికార సంస్థ భవనంలో జిల్లా కోర్టులోని సిబ్బందికి, న్యాయవాదులకు ప్రస్తుత వాతావరణ పరిస్థితి, అధిక ఉష్ణోగ్రతలను నుంచి ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశంపై ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సికిందర్ మోహన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రత్న ప్రసాద్, డాక్టర్ సికిందర్ మోహన్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉష్ణోగ్రతలు తీవ్రంగా ఉండటం వల్ల డీహైడ్రేషన్, సన్‌స్ట్రోక్ వంటి ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఈ సమస్య పట్ల షుగర్, బిపి ఉన్నవారు మరింత జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ సమస్యను ఎదుర్కోవటానికి నీరు ఎక్కువగా తీసుకోవడం, పౌష్టికాహారాన్ని తీసుకోవడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగస్తులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన

ఏలూరు అర్బన్: ఈనెల 14 నుంచి 20 వరకు జరుగుతున్న అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల స్పందన, అగ్నిమాపక సేవల శాఖ ఏలూరు జిల్లా ఆధ్వర్యంలో ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్ క్రాస్ భవనంలో ఎఎన్ఎం విద్యార్థినులకు అగ్ని ప్రమాదాల నివారణ పద్ధతులపై అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డిస్ట్రిక్ట్ ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ మాట్లాడుతూ అగ్నిమాపక వారోత్సవాలు జరపడానికి ముఖ్య కారణం 1944 ఏప్రిల్ 14న బాంబే పోర్టులో విక్టోరియా పేరిట జరిగిన భారీ పడవ అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది మృతి చెందారన్నారు. అప్పటి నుంచి ప్రతి ఏటా ఏప్రిల్ 14న అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో వారోత్సవాలు నిర్వహిస్తూ, ప్రమాదాల్లో మృతి చెందిన అగ్నిమాపక సిబ్బందికి నివాళ అర్పిస్తున్నామన్నారు. ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పోశమ్మ

ప్రజాశక్తి - నిడమర్రు

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలని ఆశా వర్కర్ల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కె.పోశమ్మ తెలిపారు. నిడమర్రు ప్రజాసంఘాల కార్యాలయంలో పిల్లా హరికుమారి అధ్యక్షతన శనివారం ఆశా వర్కర్ల మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశా వర్కర్లకు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు పెంచుతానని వైసిపి ప్రభుత్వం మాట ఇచ్చి అమలు చేయలేదన్నారు. కనీస వేతన చట్టాలు అమలు చేసి, వృత్తిలో పనిచేస్తూ చనిపోయిన వర్కర్ల కుటుంబాలను ఆదుకోవాలని తెలిపారు. అనంతరం నూతన మండల కమిటీ ఎన్నిక నిర్వహించారు. పిల్లా హరికుమారి అధ్యక్షురాలుగా, శ్రీజ కార్యదర్శిగా, అంజమ్మ, వరలక్ష్మి కోశాధికారిగా, దుర్గాదేవి, మనికుమారి, కనకదుర్గ, స్వరూప, కొండలమ్మ, జాన్సీ సభ్యులుగా ఎన్నికయ్యారు.

37,067 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

జెసి బి.లావణ్యవేణి వెల్లడి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో నేటి వరకు 3,117 మంది రైతుల వద్ద నుంచి రూ.80.76 కోట్ల విలువైన 37,067 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి తెలిపారు. శనివారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభించబడి ఇప్పటి వరకు 7,517 మంది రైతులకు చెందిన 67,273 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని నమోదు చేసుకోనగా, గ్రామ వ్యవసాయ సహాయకుల వారిచే షెడ్యూలింగ్ చేసే టెక్నికల్ సహాయకుని ద్వారా నమూనాలను సేకరించి తేమ శాతం, ఇతర నాణ్యతా ప్రమాణాలకు లోబడివున్న ధాన్యాన్ని కొనుగోలు చేయడానికి అవసరమైన 75.70 లక్షల గోనె సంచులు, 200 పైగా జిపిఎస్ పరికరం రవాణా వాహనం నేటి వరకు సమకూర్చడం జరిగిందన్నారు. జిల్లా యంత్రాంగం క్షేత్రస్థాయి పర్యవేక్షణ నిమిత్తం మండలాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని తెలిపారు. గ్రామ వ్యవసాయ సహాయకులచే షెడ్యూల్ చేయబడిన రైతుల ధాన్యం కొనుగోలు చేయాలన్నారు. అందుకు తగిన గోనె సంచులు సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. రైస్ మిల్లుకు తరలించిన ధాన్యం రైస్ మిల్లులో సకాలంలో దిగుమతి చేసుకోవాలన్నారు. అన్ని ప్రమాణాలు సరిగా ఉన్న ధాన్యంతో పాటు రైతులు రైస్ మిల్లుకు వెళ్లనవసరం లేదన్నారు. గోనె సంచులు, జిపిఎస్ అమర్చిన రవాణా వాహనం, కూలీల ఖర్చులు రైతులు భరిస్తే అందుకు సంబంధించిన సొమ్ము రైతు ఆధార్ అనుసంధానిత అకౌంటుకు జమ కాబడుతుందన్నారు. గోనె సంచులు, జిపిఎస్ అమర్చిన రవాణా వాహనం, కూలీల ఖర్చుల వివరాలు, రైతు ఎఫ్‌టిఒలో నమోదు చేయాలన్నారు. ఈ విషయాలను రైతులకు అవగాహన పరిచేందుకు బ్యానర్లు ముద్రించి 120 రైతు భరోసా కేంద్రాల్లో వుంచడమైనదన్నారు. ఫిర్యాదులు స్వీకరించుటకు జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నెంబర్లు 08812-230448, 7702003584, 7569562076, 7569597910 ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. తేమ శాతం 16 నుంచి 17 వరకు ఉండేవిధంగా చూసుకొని ధాన్యంలో తాలు, తప్పలు మొదలైన వ్యర్థపదార్థాలు గరిష్ఠంగా 1 శాతం మించకుండా చెడిపోయిన, రంగుమారిన, మొలకెత్తిన అంశాలపై రైతులందరికీ స్పష్టంగా అవగాహన కల్పించాలని అన్నారు. ఆరబెట్టుకొని పురుగులు తిన్న ధాన్యం గరిష్ఠంగా 5 శాతం మించకూడదని, వంకర తిరిగిన ధాన్యం 3 శాతం మించకుండా ఎ-గ్రేడ్ రకం కొనుగోలులో తక్కువ శ్రేణి ధాన్యం గింజలు గరిష్ఠంగా 6 శాతం వంటివి భారత ప్రభుత్వం వారిచే నిర్దేశించిన అన్ని నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా సిద్ధం చేసుకొని కనీస మద్దతు ధర క్వింటాలుకు, కామన్ రకం రూ.2,183, గ్రేడ్-ఎ రకం రూ.2,203 బయోమెట్రిక్ విధానంలో తమ వేలిముద్రలు వేసి ప్రభుత్వానికి విక్రయించే విధంగా రైతులకు పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జెసి ఆదేశించారు.

ఘనంగా చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - ముసునూరు

కలిదిండి:కేక్ కట్ చేస్తున్న నేతలు

రాజనీతిజ్ఞుడు, నిత్య శ్రామికుడు నారా చంద్రబాబు నాయుడు అని కొలుసు పార్థసారథి కొనియాడారు. శనివారం మండలంలోని చిల్లబోయినపల్లి గ్రామంలో నారా చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొలుసు పార్థసారధి, మండల టిడిపి నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పార్థసారధి మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టిడిపి అధికారంలోకి రావడం ఖాయమని, సంక్షేమం, అభివృద్ధి సమ పాలనలో ముందుకు సాగిస్తామన్నారు. నూజివీడు పట్టణంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రింగ్ రోడ్డు, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి వంటి అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి అవ్వాలంటే నూజివీడు గడ్డపై టిడిపి గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలిదిండి : మండలంలోని మట్టగుంటలో టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి అంద్రాజు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్స్ పంచారు. చంద్రబాబు తన 45 ఏళ్ల రాజకీయ జీవితంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా, 20 ఏళ్ల ప్రతిపక్ష నేతగా ప్రజల కోసం నిరంతరాయంగా పని చేస్తున్నారని అంద్రాజు శ్రీనివాసరావు అన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రాభివృద్ధికై చంద్రబాబుకు ప్రజలంతా మద్దతివ్వాలని కోరారు. నాయకులు కోకా తాతయ్య, కొపనాతి వెంకటేశ్వరరావు, విష్ణు, దుర్గా ప్రసాద్, తిరుమలశెట్టి ఈశ్వర పరశురాముడు, రమేష్, మోకా రామకృష్ణ, నాగిడి వీరాంజనేయులు పాల్గొన్నారు.

టి.నరసాపురం : మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి తోట లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు 75వ జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని, మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి విజయం సాధించి చంద్రబాబు ముఖ్యమంత్రిగా రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపించాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వడ్డే శ్రీను, తోట వీరాస్వామి నాయుడు, కాసగాని వీర్రాజు, మన్యం దుర్గారావు, అబ్బదాసరి పండు, టిఎన్ఎస్ఎఫ్ నాయకులు మద్యాహ్నపు సురేష్ పాల్గొన్నారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి నారాయణ ప్రచారం

ప్రజాశక్తి - ముదినేపల్లి

కైకలూరు నియోజకవర్గం ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గునుకుల నారాయణ శనివారం పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. మండలంలోని పేరూరు తదితర గ్రామాల్లో ప్రచారం చేస్తూ తనకు ప్రజలు మద్దతివ్వాలని కోరారు. మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామ పెద్దలు వ్యక్తిగతంగా కలుస్తూ తనకు మద్దతు నివ్వాలని కోరారు. ఆయన వెంట వాడవల్లి మాజీ సర్పంచి సుధా బత్తుల వెంకటేశ్వరరావు, పలువురు ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రైలు పట్టాలు దాటుతూ వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందిన ఘటన శనివారం ఏలూరు నగరంలో చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెదపాడు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన గరిక ముక్కు రవి(48) స్థానికంగా కంప్యూటర్ ఆపరేటర్‌గా పని చేస్తూ జీవనాన్ని సాగిస్తున్నాడు. ఈక్రమంలో శనివారం గ్రామం నుంచి ఏలూరు నగరానికి చేరుకున్నాడు. ఏలూరు కొత్త బస్టాండ్ సమీపంలో అతను రైలు పట్టాలు దాటుతున్న సమయంలో వేగంగా వచ్చిన రైలుబండి అతనిని ఢీకొంది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు జిల్లా సర్వజన ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. రైల్వే హెడ్ కానిస్టేబుల్ నంబూరి ఆదినారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ, స్కూటర్ ఢీ

మహిళ తలకు, చేతికి గాయాలు

ప్రజాశక్తి - ముసునూరు

లారీ స్కూటర్‌ను ఢీకొన్న ఘటనలో మహిళకు గాయాలు కాగా ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముసునూరు నుంచి వలసపల్లి వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారిలో ముసునూరు నుంచి వెళుతున్న లారీ వలసపల్లి నుంచి భార్యాభర్తలిద్దరు స్కూటర్‌పై వస్తుండగా ఢీకొనడంతో మహిళ తలకు, కుడి చేతికి గాయమైంది. లారీ డ్రైవర్‌పై ముసునూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, మెరుగైన వైద్యం నిమిత్తం ఆమెను విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకు వెళ్లినట్లు తెలిపారు.

పెళ్లింట గ్యాస్ లీకై మంటలు

తప్పిన ప్రమాదం

ప్రజాశక్తి - నరసాపురం

పెళ్లింట్లో వంట గ్యాస్ లీకైన ప్రమాదంలో ఎవరికీ నష్టం జరగలేదని నరసాపురం అగ్నిమాపక అధికారి కె.రామ్ భాస్కర్ అన్నారు. దీనికి సంబంధించి ఫైర్ సిబ్బంది, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఎల్‌బి.చర్ల గ్రామంలో బొబ్బిలి శ్రీనివాస్ ఇంట్లో వివాహ కార్యక్రమం జరుగుతుంది. ఈ నేపథ్యంలో వంటలు చేస్తుండగా గ్యాస్ సిలిండర్ నుంచి మంటలు వచ్చాయి. దీంతో స్థానికులు అప్రమత్తమై మంటలను అదుపు చేశారు. ఈలోపు అగ్నిమాపక సిబ్బంది చేరుకుని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకొని, పలు సూచనలు, జాగ్రత్తలు ఇచ్చారు.

వాష్ అండ్ గో కార్యక్రమం నిర్వహిస్తున్న పోలీసులు

జాతీయ రహదారిలో 'వాష్ అండ్ గో'

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

జాతీయ రహదారుల్లో వాహనదారులకు సేఫ్టీ కార్యక్రమంలో భాగంగా వాష్ అండ్ గో కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పోలీసులు శనివారం తెల్లవారుజామున నిర్వహించారు. జిల్లా ఎస్‌పి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ప్రతిరోజు ఎన్నికల విధులలో భాగంగా పోలీసులు రహదారులు వెంబడి గస్తీ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగానే వాహనదారులకు సేఫ్టీ కార్యక్రమాన్ని కూడా పోలీసులు నిర్వహిస్తున్నారు. జాతీయ రహదారి వెంబడి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులు తెల్లవారుజామున వాహనాలను నిలుపుదల చేసి వారికి వాష్ అండ్ గో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. వాహనదారులు తెల్లవారుజామున ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున స్టాప్ వాష్ అండ్ గో కార్యక్రమాన్ని పోలీసులు నిర్వహించడంతో ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని వారు చెప్పున్నారు. అంతేకాకుండా దేవాలయాలు, మసీదులు, చర్చిలు వద్ద గస్తీని కూడా పెంచారు. చెక్‌పోస్టుల వద్ద ఎటిఎంల వద్ద గస్తీని మరింత పెంచారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా రహదారుల వెంబడి ఉన్న పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

'హోం ఓటింగ్'ను సద్వినియోగం చేసుకోవాలి

ఆర్ఒ, జెసి లావణ్య వేణి

ప్రజాశక్తి - ఏలూరు

పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు వినియోగించుకోలేనివారు హోం ఓటింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ బి.లావణ్య వేణి తెలిపారు. పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కు వినియోగించుకోలేని వికలాంగులు, 85 సంవత్సరాల వయస్సు దాటిన వృద్ధుల కోసం హోం ఓటింగ్ ద్వారా ఇంటి నుంచి ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని ఎన్నికల కమిషన్ కల్పించిందన్నారు. దీని కోసం అర్హులైన అభ్యర్థులు ఫారం 12 (డి) ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఫారం 12 (డి)ను సంబంధిత పోలింగ్ బూత్ స్థాయి అధికారి లేదా తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ నుంచి గాని పొంది దరఖాస్తును పూర్తిచేసి ఈ నెల 23వ తేదీలోగా తిరిగి వారికి అందించాలన్నారు. దరఖాస్తులను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు అర్హతను పరిశీలించి అర్హత కలిగిన వారికి మే 2వ తేదీ నుండి 5వ తేదీలోగా ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకూ ఇంటి వద్ద ఓటు వేసే అవకాశం కల్పించనున్నట్లు తెలిపారు. హోం ఓటింగ్ ప్రక్రియ ఎన్నికల ప్రిసైడింగ్, ఇతర ఎన్నికల అధికారులు, మైక్రో ఒబ్జర్వర్, బిఎల్ఒలు, సెక్టార్ అధికారులు, పార్టీల ఏజెంట్ల సమక్షంలో వీడియోగ్రఫీ ద్వారా జరుగుతుందన్నారు.

ఆచంట: నియోజకవర్గ స్థాయి ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఎన్నికల ప్రచారాలపై నిఘా పెట్టాలని ఆచంట నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, పర్యాటక శాఖ రీజినల్ డైరెక్టర్ వి.స్వామి నాయుడు అన్నారు. నియోజకవర్గ స్థాయిలో నిఘా, వీడియో బృందాలు, ఫ్లయింగ్ స్క్వాడ్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన శుక్రవారం రెండు ప్రధాన పార్టీ అభ్యర్థుల నామినేషన్ల సందర్భంగా చేసిన ర్యాలీలో సమాచారాన్ని అకౌంటింగ్ టీమ్‌కు ఇవ్వాలని ఆదేశించారు. మార్టేరు సమీపంలో నెగ్గిపూడి, కవిటంతో పాటు మరో రెండు స్టాటిక్ చెక్ పోస్టుల ఏర్పాటు గురించి మాట్లాడారు. ఎన్నికల నోటిఫికేషన్ విడుదల నుంచి రాజకీయ ప్రచారాన్ని వీడియో క్యాంప్రజింగ్ చేస్తున్నామన్నారు. నామినేషన్ తేదీ నుంచి ఖర్చుగా అభ్యర్థి పేరు మీద నమోదు చేస్తామని తెలిపారు. నియోజకవర్గంలో ఎఫ్ఎస్‌టి బృందాలు తనిఖీ చేసిన వాటి వివరాలె ఎప్పటికప్పుడు నివేదిక అందించాలన్నారు. మద్యం అమ్మకాలపై కూడా నిఘా పెట్టామని, గతేడాది ఇదే రోజు ఎంత లావాదేవీలు జరిగాయో షాపుల వారీగా గణాంకాలు తనిఖీ చేస్తామన్నారు.

ఎన్నికల ఖర్చుపై అవగాహన అవసరం

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు ఖర్చు విషయంలో పూర్తిస్థాయి అవగాహన కల్పించాలని, అదే సమయంలో ఖర్చుల రిజిస్టర్ నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అసెంబ్లీ ఎన్నికల ఖర్చుల పరిశీలకులు మొహల్ అగర్వాల్ అన్నారు. ఎన్నికల కమిషన్ నియమాలను అనుసరించి కార్యాచరణ రూపొందించాలని, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలపై నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా ఖర్చుల పరిశీలనపై జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్‌ను వినియోగించుకోండి - జిల్లా ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్

ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలోని ప్రతిఒక్క ఓటరూ తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి సుమిత్‌కుమార్ కోరారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఓటు హక్కును వినియోగించుకునేందుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లు నిండిన సీనియర్ సిటిజన్లు, విభిన్నప్రతిభావంతులు, సర్వీసు ఓటర్లు, ఎన్నికల విధులలో పాల్గొనే సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

హోమ్ ఓటింగ్‌కు ప్రత్యేక టీముల ఏర్పాటు

85 ఏళ్లు పైబడిన వృద్ధులకు, విభిన్నప్రతిభావంతులకు, కోవిడ్-19 పాజిటివ్ రోగులకు వారి ఇంటి వద్దే వారి ఓటును వినియోగించుకునేందుకు ప్రత్యేక టీములు ఏర్పాటు చేశామని కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు. వారందరికీ సంబంధిత బిఎల్ఒల ద్వారా ఫారం-12 డి అందజేసి సమ్మతి తీసుకుని బిఎల్ఒలు ఆయా ఫారాలు 22వ తేదీ వరకూ స్వీకరిస్తారని పేర్కొనారు. వాటిని ఆమోదించిన తర్వాత మే 3 నుండి ఐదో తేదీ వరకు హోం టీముల ద్వారా వారి ఇంటి వద్ద ఓటు వేయించుకుని స్వీకరిస్తామని తెలిపారు. జిల్లాలో 7,641 మంది 85 ఏళ్ల పైబడిన ఓటర్లు, 19,232 మంది విభిన్నప్రతిభావంతులు ఓటర్లుగా ఉండగా ఇప్పటి వరకు 519 తమ ఓటు హక్కు కోసం ఫారం-12డి ద్వారా దరఖాస్తు చేసుకున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ నియోజకవర్గానికి మూడు చొప్పున పోలింగ్ టీములను ఏర్పాటు చేశామని, ఈ టీములు మే 3వ తేదీ నుంచి 7వ తేదీ వరకు పర్యటిస్తాయని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్‌కు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, మే 6వ తేదీ నుండి 8వ తేదీ వరకు ఫెసిలిటేషన్ సెంటర్ల వద్ద ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు ఫారం-12 ద్వారా దరఖాస్తు చేసుకున్న వారందరికీ పోస్టల్ బ్యాలెట్ ఓటింగు సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు.

368 సి - విజిల్ ఫిర్యాదులు పరిష్కారం

రూ.13.45 కోట్లు విలువైన నగదు, బంగారం, వస్తువులు సీజ్ - జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

ప్రజాశక్తి - ఏలూరు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో సి-విజిల్ యాప్ ద్వారా వచ్చిన 368 ఫిర్యాదులను పరిష్కరించామని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ప్రసన్న వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలపై వచ్చిన 99 ఫిర్యాదులు పరిష్కరించినట్లు పేర్కొన్నారు. ఎన్‌జిఎస్‌పి పోర్టల్ ద్వారా 600 ఫిర్యాదులు స్వీకరించగా వాటిలో 597 పరిష్కరించామని, మరో మూడు పరిశీలనలో ఉన్నాయని తెలిపారు. జిల్లాలో మే 13న జరగనున్న ఎన్నికల్లో పోటీ చేసేందుకు శనివారం వరకూ 24 నామినేషన్లు దాఖలయ్యాయని పేర్కొన్నారు. ఇఎస్ఎంఎస్ కింద చేపట్టిన సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకూ జిల్లావ్యాప్తంగా మొత్తం రూ.13.45 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని తెలిపారు. దీనిలో రూ.195.20 లక్షలు నగదు ఉండగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.126.86 లక్షల విలువైన మద్యం స్వాధీన పర్చుకున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ/ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనల్లో ఇంతవరకూ 1781 అనుమతులు ఇచ్చామని తెలిపారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 1854 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకూ 1781 అనుమతులు జారీ చేశామని, మరో 73 పరిశీలనలో ఉన్నాయని పేర్కొన్నారు. ఎన్నికల నియమావళి అమల్లో ఉన్నందున్న ప్రజలు నగదు గాని, ఇతర విలువైన వస్తువులుగాని ప్రయాణ సమయంలో తీసుకెళ్లేటప్పుడు అందుకు సంబంధించి సరైన ఆధారాలను తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

ఉంగుటూరు స్వతంత్ర అభ్యర్థిగా కుమార్ నామినేషన్

ప్రజాశక్తి - ఉంగుటూరు

ఉంగుటూరు అసంబ్లీ స్థానానికి స్వతంత్ర అభ్యర్థిగా ఉంగుటూరుకు చెందిన పుట్టా కుమార్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి, ఏలూరు ఆర్‌డిఒ ఎన్ఎస్‌కె.ఖాజావలీకి నామినేషన్ పత్రాలను అందజేశారు. ఇప్పటివరకూ మూడు సెట్ల నామినేషన్లు వచ్చాయని ఆర్ఒ తెలిపారు.

అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న పుట్టా కుమార్

సార్వత్రిక సంగ్రామం

ప్రముఖుల ఖిల్లా.. భీమవరం..

భీమవరం డెల్టాకు నడిబొడ్డు. జిల్లాల పునర్విభజన అనంతరం పశ్చిమగోదావరి జిల్లా రాజధానిగా రూపాంతరం చెందింది. జిల్లా రాజకీయాలకు కేంద్ర బిందువు భీమవరం. నాగరికతకు నిలయం.. విద్యాలయాల కేంద్రం.. పంచారామాల్లో ఒకటిగా విరాజిల్లుతోంది. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతులకు ప్రధాన కేంద్రం. స్వాతంత్ర సమరంలో రెండో బార్డోలిగా ఖ్యాతికెక్కిన భీమవరం నియోజకవర్గానికి ఎంతో విశిష్టత ఉంది. ఉద్దండులైన రాజకీయ నేతలు ఇక్కడ నుంచి ఉద్భవించిన వారే. ఎంతోమంది స్వాతంత్ర సమరయోధులు, త్యాగధనులు ఈ ప్రాంతంవారే. పలువురు ప్రముఖులు ఈ ప్రాంతం నుంచి వారివారి రంగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగిన వారే. జిల్లాలోనే అతి ఖరీదైన పట్టణంగా పేరుగాంచింది.

ప్రజాశక్తి - భీమవరం

స్వాతంత్రోద్యమంలో రెండో బార్డోలిగా ఖ్యాతిగాంచిన భీమవరం రాష్ట్ర రాజకీయాల్లో ఒక ప్రత్యేకతను సంతరించుకుంది. అప్పట్లో వరి, సేద్యం, రైస్ మిల్లింగ్ రంగాల్లో గుర్తింపు పొంది ప్రస్తుతం విద్య, వైద్య, ఆక్వా హబ్‌గా రాణిస్తున్న నియోజకవర్గంలో రసవత్తర పోరుకు నేడు తెరలేచింది. నియోజకవర్గం జనాభా 3,32,760 మంది. వీరిలో మహిళలు 1,67,080, పురుషులు 1,65,674. మార్చి 31వ తేదీ లెక్కల ప్రకారం నియోజకవర్గంలో మొత్తం 2,51,065 ఓటర్లు ఉన్నారు. వీరిలో 1,21,844 మంది పురుషులు, 1,29,172 మంది మహిళా ఓటర్లు, ట్రాన్స్ జెండర్స్ 49 మంది ఉన్నారు. ప్రస్తుతం వైసిపి సిట్టింగ్ ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్, మాజీ ఎంఎల్ఎ, జనసనే అభ్యర్థి పులపర్తి రామాంజనేయులు బరిలో ఉన్నారు. మూడోసారి తలపడుతున్న వారిలో ఎవరు హ్యాట్రిక్ సాధిస్తారోనని చర్చ సాగుతోంది. సిట్టింగ్ వైసిపి ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ 2004 నాటి ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసి టిడిపి అభ్యర్థి పివి.నరసింహరాజుపై 7905 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అసెంబ్లీలో తొలిసారి అడుగుపెట్టారు. ఆ ఎన్నికల్లో గ్రంధి 63,939 ఓట్లు సాధించగా, పివి.నరసింహరాజు 56,034 ఓట్లు సాధించి ఓటమి పాలయ్యారు. 2009 ఎన్నికల్లో నాటి పరిణామాల నేపథ్యంలో గ్రంధి శ్రీనివాస్ కాంగ్రెస్ టిక్కెట్ కోల్పోగా అనూహ్యంగా పులపర్తి రామాంజనేయులు టిక్కెట్ దక్కించుకున్నారు. 63,862 ఓట్లు కైవసం చేసుకుని తన సమీప ప్రజారాజ్యం అభ్యర్థి కనకరాజు సూరిపై 22,100 ఓట్ల మెజార్టీతో గెలుపొంది అసెంబ్లీలో తొలిసారి అడుగు పెట్టారు. ఆ ఎన్నికల్లో కనకరాజు సూరి 41,763 ఓట్లతో ఓటమి చెందారు. రాష్ట్ర విభజన తర్వాత 2014లో జరిగిన ఎన్నికల్లో పులపర్తి రామాంజనేయులు టిడిపి తరపున పోటీ చేసి తన సమీప వైసిపి అభ్యర్థి గ్రంధి శ్రీనివాస్‌పై 13,676 మెజార్టీతో గెలుపొందారు. ఆ ఎన్నికల్లో పులపర్తి 90,772 ఓట్లు సాధించగా, గ్రంధి 77,046 ఓట్లు సాధించారు. 2019 ఎన్నికల్లో జరిగిన త్రిముఖ పోరులో గ్రంధి శ్రీనివాస్ 70,642 ఓట్లు సాధించి జనసేనాని పవన్ కళ్యాణ్‌పై 8,357 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ ఎన్నికల్లో పవన్‌కళ్యాణ్ 62,285 ఓట్లు సాధించి రెండో స్థానంలో నిలిచారు. టిడిపి తరపున పులపర్తి రామాంజనేయులు 54,037 ఓట్లు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. అయితే ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికల్లో ఈ ఇరువురి మధ్య రసవత్తర పోరు జరుగుతోంది. ఒకటే సామాజిక తరగతికి చెందిన అభ్యర్థులు కావడంతో హోరాహోరీగా పోరు సాగుతోంది.



2004 నాటి ఎన్నికలకు భీమవరం నియోజకవర్గంలోని పాలకోడేరు మండలం ఉండి నియోజకవర్గం పరిధిలోకి వెళ్లిపోవంతో క్షత్రియ సామాజిక వర్గం హవాకు ఫుల్‌స్టాప్ పడింది. వీరవాసరం మండలం, భీమవరం రూరల్ తుందుర్రు, తుందుర్రు శివారు గ్రామాలు, వెంప, వెంప శివారు గ్రామాలు భీమవరం నియోజకవర్గంలో కలవడంతో నియోజకవర్గ స్వరూపం మారిపోయింది. నియోజకవర్గంలో కాపు, కాపు ఉపకులాల ఓట్లు సుమారు 90 వేలకు చేరడంతో వారే నిర్ణయాత్మక పాత్రను పోషిస్తారనడంలో ఎటువంటి సందేహమూ లేదని విశ్లేషకుల అభిప్రాయం.

నియోజకవర్గ స్థితిగతులు

భీమవరం నియోజకవర్గం ఆర్థికంగా అభివృద్ధి చెందింది. కొన్ని సామాజిక తరగతుల్లో ఆర్థికంగా స్థిరపడిన పలువురు పెద్దలు ఉన్నారు. సంక్రాంతి సందర్భాల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడినవారు కూడా ఇక్కడకు వచ్చి సంప్రదాయం పేరిట నిర్వహించే కోడిపందేల్లో పాల్గొనడం విశేషం.

విద్యారంగం..

డిఎన్‌ఆర్ డిగ్రీ కళాశాలను 1945లో స్థాపించారు. దీంతోపాటు మరో ఆరు డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. వీటిలో ఒకేఒక్క ప్రభుత్వ డిగ్రీ కళాశాల అరకొర సౌకర్యాల మధ్య కొట్టుమిట్టాడుతోంది. వీటిలో ఏడు వేల మందికిపైగా విద్యార్థులు విద్య అభ్యసిస్తున్నారు. ఎనిమిది జూనియర్ ఇంటర్ కళాశాలలు ఉన్నాయి. ఫార్మశ్రీ, డెంటల్, పలు ఇంజినీరింగ్ కళాశాలలతో పాటు ఉపాధ్యాయ శిక్షణ కళాశాలలు కూడా ఉన్నాయి.

ఇప్పటి వరకూ ప్రజాపార్టీ, స్వతంత్ర అభ్యర్థి ఒక్కోసారి, కాంగ్రెస్ పార్టీ ఏడుసార్లు, టిడిపి నాలుగుసార్లు గెలుపొందాయి. 1994లో ప్రచారంలోనే కాంగ్రెస్ అభ్యర్థి భూపతిరాజు విజయ్‌కుమార్ రాజు మరణించడంతో ఉప ఎన్నిక జరిగింది. అతని భార్య కమలాకాంత కస్తూరి పోటీ చేయగా ఆమెపై టిడిపి అభ్యర్థి పివి.నరసింహరాజు 6,655 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. 2009 ఎన్నికల ముందు పాలకోడేరు, భీమవరం మండలాలతో పాటు భీమవరం పురపాలక సంఘం కలిపి నియోజకవర్గంగా ఉండేది. 2009 ఎన్నికల్లో పాలకోడేరు, ఉండి నియోజకవర్గంలో విలీనం కాగా, పాలకొల్లు నియోజకవర్గంలోని వీరవాసరం మండలం భీమవరంలో కలిసింది. గత ఎన్నికల్లో బిసిలు ప్రరాపా, కాంగ్రెస్‌కు మద్దతు ఇవ్వడంతో టిడిపి మూడో స్థానంలోకి చేరింది.

భీమవరం శాసనభ్యులుగా చేసిన వారిలో భూపతిరాజు విజయ్‌కుమార్‌రాజు, అల్లూరి సుభాష్ చంద్రబోస్ నరసాపురం లోక్‌సభ స్థానానికి కూడా ప్రాతినిధ్యం వహించారు. విజయకుమార్ రాజు మూడుసార్లు లోక్‌సభకు గెలవగా, 1991లో ఆనాటి కాంగ్రెస్ ప్రధాని పివి నరిసింహారావు ప్రభుత్వాన్ని రక్షించడానికి గాను టిడిపి నుంచి చీలి కాంగ్రెస్‌లో ప్రవేశించారు.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ
1952	బి.సుబ్బరాజు	కెఎంపిపి	ఎన్.సంగయ్య	కాంగ్రెస్
1955	నాచు వెంకట్రామయ్య	కాంగ్రెస్	వై.పోలిశెట్టి	సిపిఐ
1962	ఎన్.వెంకట్రామయ్య	కాంగ్రెస్	వై.పోలిశెట్టి	సిపిఐ
1967	బి.విజయకుమారరాజు	స్వతంత్ర	ఎన్.వెంకట్రామయ్య	కాంగ్రెస్
1972	బి.విజయకుమారరాజు	కాంగ్రెస్	వై.వెంకట్రామరాజు	స్వతంత్ర
1978	కెవి.నరసింహరాజు	కాంగ్రెస్	ఎం.పద్మనాభం	జనతా
1983	పివి.నరసింహరాజు	టిడిపి	వి.రామకృష్ణంరాజు	కాంగ్రెస్
1985	పివి.నరసింహరాజు	టిడిపి	బిఎన్‌వి.రామేశ్వరరావు	కాంగ్రెస్
1989	ఎ.సుభాష్‌చంద్రబోస్	కాంగ్రెస్	పివి.నరసింహరాజు	టిడిపి
1995	పివి.నరసింహరాజు	టిడిపి	భూపతిరాజు కస్తూరి	కాంగ్రెస్
1999	పివి.నరసింహరాజు	టిడిపి	వి.రామకృష్ణంరాజు	కాంగ్రెస్
2004	జి.శ్రీనివాస్	కాంగ్రెస్	పివి.నరసింహరాజు	టిడిపి
2009	పి.రామాంజనేయులు	కాంగ్రెస్	కనకరాజు సూరి	పిఆర్‌పి
2014	పి.రామాంజనేయులు	టిడిపి	గ్రంధి శ్రీనివాస్	వైసిపి
2019	గ్రంధి శ్రీనివాస్	వైసిపి	కె.పవన్‌కళ్యాణ్	జనసేన

కూరగాయలమ్మి.. పతి కోసం సతి ప్రచారం

తణుకులో కూటమి గెలుపు ఖాయం: ఆరిమిల్లి సతీమణి కృష్ణతులసి

ప్రచారంలో భాగంగా కూరగాయలు విక్రయిస్తున్న ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి

ప్రజాశక్తి - తణుకురూరల్

తణుకు నియోజకవర్గంలో తెలుగుదేశం, జనసేన, బిజెపి కూటమి గెలుపు ఖాయమని మాజీ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణతులసి అన్నారు. తణుకు పట్టణంలోని 19వ వార్డులో ఆమె ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కొద్దిసేపు కూరగాయలు విక్రయించి ప్రచారం సాగించడం అందరినీ ఆకర్షించింది. ఈ సందర్భంగా కృష్ణతులసి మాట్లాడుతూ వైసిపి పాలన పట్ల ప్రజలు విసిగిపోయారన్నారు. రాష్ట్రాన్ని పూర్తిగా అప్పుల్లో ముంచేసిన ఘనత వైసిపికి దక్కుతుందన్నారు. టిడిపి ప్రభుత్వంలో మహిళలకు పెద్దపీట వేశారన్నారు. త్వరలోనే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ నాయకత్వంలో ఈ రాష్ట్రాన్ని బాగు చేసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు బసవ రామకృష్ణ, బిజెపి నాయకులు అయినంపూడి శ్రీదేవి, తామరపు రమణమ్మ, దూలం చిట్టిపాప, కొప్పాలి ఇందిరాదేవి, కాకిలేటి సత్యవాణి, కొండేటి విజయ, తెలగరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు

టిడిపి జాతీయ అధ్యక్షులు చంద్రబాబు ఆయురారోగ్యలతో వర్ధిల్లాలని మాజీ ఎంఎల్ఎ, టిడిపి అభ్యర్థి ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. శనివారం తణుకు పట్టణంలో ఎన్నికల కార్యాలయ ఆవరణలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి నాయకులకు, కార్యకర్తలకు, అభిమానులకు పంచారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆరిమిల్లి రాధాకృష్ణ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాల్లో వేలాది మంది యువతీ, యువకులు ఐటి ఉద్యోగాలు చేస్తున్నారంటే దానికి మూలం చంద్రబాబు చేసిన కృషి అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంఎల్ఎ ముళ్లపూడి వెంకటకృష్ణారావు, ఒమ్మి రాంబాబు, తాతపూడి మారుతీరావు, బొంతు శ్రీను, కునుకు సత్తిబాబు, గుమ్మల హనుమంతు, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఇంటికి పంపాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి బలరాం

ప్రజాశక్తి - భీమవరం

గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయని బిజెపితో అంట కాగుతున్న టిడిపి, జనసేన, వైసిపిలను రానున్న ఎన్నికల్లో ఇంటికి సాగనంపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం పిలుపునిచ్చారు. స్థానిక ప్యాడీ మర్చంట్స్ భవనంలో ఆ పార్టీ భీమవరం నియోజకవర్గ విస్తృత సమావేశం శనివారం నిర్వహించారు. సమావేశానికి పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం మాట్లాడుతూ కేంద్రంలో మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో దేశానికి, రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఎన్నికల ముందు అనేక వాగ్దానాలు చేసి అధికారంలో రాగానే బడా పెట్టుబడీదారులకు దేశ సంపదను దోచిపెట్టారన్నారు. విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి పేదవాని ఖాతాలో రూ.15 లక్షలు వేస్తామని చెప్పి ప్రజలను మోసగించారన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి యువతను దగా చేశారని విమర్శించారు. ఇటువంటి బిజెపి ప్రభుత్వానికి వైసిపి, టిడిపి, జనసేన పార్టీలు భజన చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా ప్రజలు విజ్ఞతతో ఆలోచించి రాష్ట్రానికి అన్యాయం చేసిన మోడీ ప్రభుత్వాన్ని, దానితో అంట కాగుతున్న పార్టీలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. వామపక్షాలు బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి అంకెం సీతారాంను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జెఎన్‌వి.గోపాలన్ మాట్లాడుతూ దేశ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా నిత్యావసర సరుకులు, పెట్రోలు, డీజిల్, గ్యాస్ ధరలను విపరీతంగా పెంచి సామాన్య ప్రజల నడ్డి విచారన్నారు. సమావేశంలో సిపిఎం జిల్లా నాయకులు ఎం.వైకుంఠరావు, జుత్తిగ నరసింహమూర్తి, ఇంజేటి శ్రీను, పి.మృత్యుంజయ, డి.త్రిమూర్తులు, సత్యనారాయణ, చెల్లబోయిన వెంకటేశ్వరరావు, వడుగు వెంకటేశ్వరరావు, డి.రత్నరాజు పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న నేతలు, కార్యకర్తలు

చింతలపూడిలో విజయరాజు నామినేషన్

ప్రజాశక్తి - చింతలపూడి

వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థి కంభం విజయరాజు శనివారం నామినేషన్ దాఖాలు చేశారు. నామినేషన్ దాఖాలకు పెద్ద ఎత్తున్న జనం తరలిరావడంతో చింతలపూడి జనసందోహంతో నిండిపోయింది. లింగపాలెం మండలం వలసపల్లి అడ్డురోడ్డు నుంచి ర్యాలీగా బయలుదేరారు. లింగపాలెం గుడి వద్ద పూజలు నిర్వహించి ర్యాలీగా బయలుదేరారు. ద్విచక్ర వాహనాలపై కేరింతలు కొడుతూ ర్యాలీలో పాల్గొన్నారు. అందరికీ అభివారం చేస్తూ ర్యాలీ సాగింది. అనంతరం చింతలపూడి నియోజకవర్గం ఎన్నికల అధికారి కార్యాలయానికి చేరుకుని ఆర్ఒ అద్దయ్యకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాలుగు మండలాల నుంచి ప్రజలు వచ్చారని, ఈ జనం చూస్తుంటే విజయోత్సవ ర్యాలీలా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జానకీరెడ్డి, పట్టణ అధ్యక్షులు కొప్పుల నాగు, జెడ్‌పిటిసి నీరజా సుధాకర్, ఎంపిపి రాంబాబు, దిలీప్, నాలుగు మండలాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కామవరపుకోట: వైసిపి చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ అభ్యర్థిగా కంభం విజయరాజు శనివారం చింతలపూడి తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ వేసేందుకు కామవరపుకోట నుంచి భారీ సంఖ్యలో వైసిపి శ్రేణులతో తరలివెళ్లారు. ద్విచక్ర వాహనాలు, కార్లలో వివిధ గ్రామాల నుంచి వేల మంది కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లారు.

చింతలపూడి స్వతంత్ర అభ్యర్థిగా కృష్ణ



నామినేషన్ వేస్తున్న కృష్ణ

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి నియోజకవర్గ స్వతంత్ర అభ్యర్థిగా వెంపా కృష్ణ శనివారం నామినేషన్ దాఖాలు చేశారు. మానుకొండ గౌతమ్, మిర్యాల చందు బలపర్చారు. నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి అందజేశారు.

లావేటి వీర శివాజీ నామినేషన్

కైకలూరు: అఖిల భారత ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ నుంచి లావేటి వీర శివాజీ నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి భాస్కర్‌కు శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్లు పనిచేసే వ్యక్తులకు ఓటు వేసి విజయాన్ని చేకూర్చాలన్నారు. ఎన్నికలు ఆర్థిక భారం అవుతున్నాయని, పేదలైన యువకులు రాజకీయాల్లోకి రాకుండా ఉంటేనే మంచిదని ఆయన సూచించారు.

నూజివీడులో రవీంద్రనాథ్ నామినేషన్

నూజివీడు రూరల్: రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున నూజివీడు ఎంఎల్ఎ అభ్యర్థిగా పాము రవీంద్రనాథ్ శనివారం నూజివీడులో నామినేషన్ దాఖలు చేశారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో ఆర్‌డిఒ భవానీ శంకర్‌కు తన నామినేషన్ పత్రాన్ని అందజేశారు. తాను రిఫార్మ్స్ పార్టీ ఆఫ్ ఇండియా తరపున పోటీ చేస్తున్నానని, తనకు ప్రజలు మద్దతు తెలపాలని కోరారు.

గూడెంలో రాజు..

తాడేపల్లిగూడెం: రిపబ్లిక్ ఆఫ్ ఇండియా పార్టీ (ఎ) ఎంఎల్ఎ అభ్యర్థిగా మరపట్ల రాజు తరపున ఒక సెట్టు నామినేషన్ దాఖలు చేశారని రిటర్నింగ్ అధికారి, ఆర్‌డిఒ కె.చెన్నయ్య తెలిపారు. నామినేషన్ పత్రాలు క్షుణ్ణంగా పరిశీలించి స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

కాగిత రాఘవులు మృతి తీరని లోటు

ప్రజాశక్తి - చింతలపూడి

సిపిఎం ప్రగడవరం గ్రామ శాఖ కార్యదర్శి కాగిత రాఘవులు మృతి తీరని లోటని ఆ పార్టీ చింతలపూడి కన్వీనర్ ఆర్‌వి.ఎస్.నారాయణ అన్నారు. మండలంలోని ప్రగడవరం గ్రామ శాఖ కార్యదర్శి కాగిత రాఘవులు (74) శుక్రవారం మధ్యాహ్నం ప్రగడవరంలో అనారోగ్యంతో మృతి చెందారు. రాఘవులు భార్య గత 15 రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందారు. వారికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాఘవులు మృతికి సిపిఎం చింతలపూడి మండల కమిటీ సంతాపం తెలిపింది. సిపిఎం చింతలపూడి కన్వీనర్ ఆర్‌వి.ఎస్.నారాయణ మాట్లాడుతూ రాఘవులు కొంతకాలం జీలుగుమిల్లి ప్రాంతంలో వ్యాపారం చేస్తూ అక్కడ పార్టీలో కొనసాగారని, తరువాత తన స్వగ్రామం ప్రగడవరం వచ్చి ఆ పరిసర గ్రామాల్లో పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. ఆయన మృతదేహానికి సిపిఎం సీనియర్ నాయకులు కనుమతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, మండల కన్వీనర్ రామిశెట్టి సత్యనారాయణ ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి ఎ.రవి, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ సంతాపం తెలిపారు.

రైతుల అభ్యున్నతికి కృషి : మంత్రి కారుమూరి

ప్రజాశక్తి - తణుకు రూరల్

రైతుల అభ్యున్నతి కోసం తాము రైతు వెంటే ఉంటామని రాష్ట్ర పౌరసరఫరాల, వినియోగదారుల వ్యవహారాల మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వరరావు అన్నారు. తణుకు నియోజకవర్గంలోని ఇరగవరం, అత్తిలి, తణుకు మండలాల్లో పంట పొలాలను ఆయన శనివారం సందర్శించి రైతులతో మాట్లాడారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పలు గ్రామాల్లో పర్యటించి రైతులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తమ ప్రభుత్వం అంతా రైతు పక్షపాతంగా కొనసాగిందన్నారు.

అభివృద్ధి చూసి ఓటేయండి

ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం

ప్రజలందరూ సంక్షేమ పథకాలు చూసి ఓటేయాలని వైసిపి నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలోని వేములదీవి వెస్ట్ గ్రామంలో ప్రసాదరాజు ప్రజా ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నియోజకవర్గంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చూసి గెలిపించాలని కోరారు.

జనసేనలోకి మారం వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

తాడేపల్లిగూడెంలో వైసిపికి షాక్ తగిలింది. వైసిపిలో కీలక నాయకుడు, ఆర్యవైశ్య సంఘం గౌరవ అధ్యక్షుడు మారం వెంకటేశ్వరరావు శనివారం సుమారు 500 మంది అనుచరులతో జనసేన పార్టీలో చేరారు. జనసేన తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి బొలిశెట్టి శ్రీనివాస్ సమక్షంలో మారం కుమారుడు గిరీష్, కొడాలి సత్యనారాయణలతోపాటు మరో 500 మంది జనసేన పార్టీలో చేరారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్ఎన్ఎస్ సర్కిల్ నుంచి ఎంవిఆర్ లాడ్జి వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.

మేలైన వరి రకాలు ఎంపిక చేసుకోండి

ప్రజాశక్తి - పెనుమంట్ర

రైతులు మేలైన ప్రత్యామ్నాయ వరి రకాలను ఎంపిక చేసుకోవాలని ఆచార్య ఎన్‌జి.రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిశోధనా సంచాలకులు ఎల్.ప్రశాంతి అన్నారు. మండలంలోని మార్టేరు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో రెండో రోజు శనివారం నిర్వహించిన గోదావరి మండల పరిశోధన, విస్తరణ సలహా మండలి సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. రైతులు వారి ప్రాంతానికి అనువుగా ఉండే నీటి లభ్యత, చీడపీడలు ఆశించే అవకాశాన్ని బట్టి రకాలను ఎంపిక చేసుకోవాలని తెలిపారు. తక్కువ ఖర్చులో రైతులకు అనువుగా ఉండే యంత్రాలను రూపొందించాల్సిన ఆవశ్యకత మార్టేరు శాస్త్రవేత్తలపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో విస్తరణ సంచాలకులు డాక్టర్ కెఎస్ఎస్.నాయక్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే నైతిక విలువలు పాటించాలి

జిల్లా విద్యాశాఖాధికారి ఆర్‌వి.రమణ

ప్రజాశక్తి - కాళ్ళ

ప్రతి విద్యార్థి చదువుతోపాటు నైతిక విలువలు, సాంస్కృతిక, ఆటలలో నైపుణ్యం పెంపొందించుకోవాలని, క్రమశిక్షణ కలిగి ఉండాలని జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ అన్నారు. కోపల్లె హై స్కూల్‌లో ఐక్య నేషనల్ ఫౌండేషన్ ద్వితీయ వార్షికోత్సవం, పాఠశాల వార్షికోత్సవ సభను శనివారం నిర్వహించారు. ఈ సభలో జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్‌వి.రమణ మాట్లాడుతూ విద్యార్థుల్లో నైతిక విలువలు పెంపొందించడం కోసం ఏర్పడిన ఐక్య నేషనల్ ఫౌండేషన్ కార్యక్రమాలను అభినందించారు. అనంతరం ఫౌండేషన్ సభ్యులు డిఇఒ రమణను ఘనంగా సత్కరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని నిర్మలాదేవి అధ్యక్షత వహించారు. ఐక్య నేషనల్ ఫౌండేషన్ ఛైర్మన్ ముదునూరి శివరామరాజు, సెక్రటరీ దాయన సురేష్ చంద్ర, భీమవరం సబ్ ట్రెజరీ ఆఫీసర్ ఎ.రవి వర్మ, మండల విద్యాశాఖ అధికారి జి.కనకరాజు, ఐక్య నేషనల్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు వైఎస్ ఆచారి, నల్ల విజయలక్ష్మి, చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు నల్ల సత్యకృష్ణ కిరణ్ ప్రసాద్, ఎఎల్ టీచర్ గోపాల శర్మ, రిటైర్డ్ ఎంఇఒ సత్యానంద, స్వామి నాయుడు, సుబ్బరాజు, మాణిక్యాలరావు పాల్గొన్నారు.

డిఇఒ రమణను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఇండియా వేదిక అభ్యర్థులను గెలిపించండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపు

ప్రజాశక్తి - కుక్కునూరు

బిజెపి మతోన్మాద కార్పొరేట్ విధానాల నుంచి దేశాన్ని రక్షించేందుకు బిజెపి, తొత్తు పార్టీలను ఓడించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి పిలుపునిచ్చారు. శనివారం పాత దాచారంలో సిపిఎం మండల జనరల్ బాడీ సమావేశం శ్యామల లక్ష్మణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి పొత్తు, తొత్తు పార్టీలను ఓడించడం ద్వారానే రాజ్యాంగాన్ని రక్షించుకోవడం, మతసామరస్యాన్ని కాపాడుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల్లో బిజెపి, టిడిపి, జనసేన, వైసిపిలను ఓడించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. అందుకు సిపిఎం కార్యకర్తలు ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించడం కోసం సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో బిజెపి వలలో పడకుండా ప్రతిఒక్కరూ విజ్ఞతతో ఆలోచించి ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం మండల కమిటీ సభ్యులు యర్రం సాయికిరణ్, భయ్యాన శ్రీను, పట్ల లక్ష్మయ్య, షేక్ వలిపాషా, పులదాసు రమేష్, శాఖ కార్యదర్శులు, షేక్ ఖాసీం, కోట మోహన్ రావు, పార్టీ సభ్యులు పాల్గొన్నారు.

ఆశ్రంకు ఐదు విభాగాల్లో ఐఎస్ఒ అక్రిడిటేషన్

ఆసుపత్రి డైరెక్టర్ రతీదేవి

ప్రజాశక్తి - ఏలూరు

అల్లూరి సీతారామరాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆశ్రం) ఐదు విభాగాల్లో ఐఎస్ఒ అక్రిడిటేషన్‌ను సాధించిందని ఆసుపత్రి డైరెక్టర్ రతీదేవి తెలిపారు. అక్రిడిటేషన్ పత్రాలను ఆసుపత్రి అధికారులు, సిబ్బందితో కలిసి డైరెక్టర్ రతీదేవి ఆసుపత్రిలో ప్రదర్శించి, వివరాలను సిబ్బందితో పంచుకున్నారు. ఈ సందర్భంగా రతీదేవి మాట్లాడుతూ ఆసుపత్రి కార్యకలాపాల్లో నాణ్యత, సమర్థత అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడం ద్వారా ఈ స్థాయిని పొందిందన్నారు. ఐఎస్ఒ 50001:2018 శక్తి నిర్వహణ వ్యవస్థ, ఐఎస్ఒ 14001:2015 పర్యావరణ నిర్వహణ వ్యవస్థ, ఐఎస్ఒ 21001:2018 విద్యా సంస్థల నిర్వహణ వ్యవస్థ, ఐఎస్ఒ 41001:2018 సౌకర్య ప్రమాణాలు, ఐఎస్ఒ మంచి పరిశుభ్రత పద్ధతులు వంటి ఐదు విభాగాల్లో అక్రిడిటేషన్‌ను సాధించిందన్నారు. ఐఎస్ఒ అక్రిడిటేషన్ అనేది అల్లూరి సీతారామ రాజు అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఆశ్రం) పట్ల నిబద్ధతకు నిదర్శనమన్నారు. ఐఎస్ఒ అక్రిడిటేషన్‌ను సాధించే కఠినమైన ప్రక్రియలో ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ ఐఎస్ఒ నిర్దేశించిన కఠినమైన అవసరాలకు అనుగుణంగా తమ సిస్టమ్‌లు, ప్రక్రియలు, విధానాలపై సమగ్ర సమీక్ష ఉంటుందన్నారు. వినియోగదారులకు అత్యున్నత సేవలను అందించడంలో తమ ఆసుపత్రి బృందం కృషి, అంకితభావాన్ని ధ్రువీకరిస్తూ ఐఎస్ఒ అక్రిడిటేషన్‌ను సాధించినందుకు తాము సంతోషిస్తున్నామన్నారు. ఆసుపత్రి సిఇఒ డాక్టర్ హనుమంతరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శాంతయ్య, రాజరాజన్, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ దనిష్ట బత్తుల పాల్గొన్నారు.

న్యాయవాదులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేత

ప్రజాశక్తి - తణుకురూరల్

మే నెల 11వ తేది శనివారం తణుకు కోర్టు ఆవరణలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఛైర్మన్, నాల్గవ అదనపు జిల్లా జడ్జి డి.సత్యవతి తెలిపారు. ఈ సందర్భంగా సత్యవతి మాట్లాడుతూ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీపడదగ్గ క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, ప్రీలిటిగేషన్ కేసులు పరిష్కరించి ఇరుపార్టీల మధ్య రాజీ చేస్తారని అన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు వినియోగించుకోవాలని తెలిపారు. కోర్టు ఆవరణలో వడదెబ్బ తగిలితే తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించడానికి కొమ్మాయి చెరువు గట్టు పిహెచ్‌సి డాక్టర్‌తో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ఓఆర్ఎస్, గ్లూకోజ్ ప్యాకెట్లు కోర్టులోని న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి, కక్షిదారులకు పంపిణీ చేశారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తున్న సత్యవతి

వారాహి యాత్రను జయప్రదం చేయాలి

జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురంలో పవన్ కళ్యాణ్ వారాహి విజయభేరి యాత్రను విజయవంతం చేయాలని జనసేన ఎంఎల్ఎ అభ్యర్థి బొమ్మిడి నాయకర్ అన్నారు. శనివారం పట్టణంలోని జనసేన కార్యాలయంలో టిడిపి నరసాపురం ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, బిజెపి కన్వీనర్ మేకల సతీష్‌తో కలిసి విలేకరులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం మండలంలోని సీతారామపురం స్వర్ణాంధ్ర కళాశాలలో మధ్యాహ్నం 3 గంటలకు హెలికాప్టర్‌లో దిగి, అక్కడ నుంచి 216 జాతీయ రహదారిపై నరసాపురం చేరుకుంటారు. అనంతరం పట్టణంలోని మెయిన్ రోడ్డులో 4 గంటలకు జరిగే సభలో పవన కళ్యాణ్ మాట్లాడతారని తెలిపారు. అనంతరం సీతారామపురం, మొ గల్తూరు, ముత్యాలపల్లి, లోసరి మీదుగా భీమవరం చేరుకుంటారని నాయకర్ తెలిపారు. ఈనెల 22వ తేదీన నామినేషన్ వేస్తున్నానని, నామినేషన్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు.

క్రీడలతో మానసికోల్లాసం

ప్రజాశక్తి - భీమవరం రూరల్

క్రీడాకారులను ప్రోత్సహిస్తే క్రీడల్లో మరింత రాణిస్తారని, క్రీడలు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని మార్నింగ్ కాఫీ క్లబ్ కన్వీనర్ బొండా రాంబాబు, కో కన్వీనర్ ఓలేటి శ్రీనివాస గుప్తా, కారుమూరి సత్యనారాయణమూర్తి అన్నారు. ఇటీవల గుంటూరులో భారతీయ విద్యా భవన్స్‌లో జరిగిన బాస్కెట్ బాల్ పోటీల్లో భీమవరం భవన్స్‌కు చెందిన బొండాడ నయన ఉన్న టీమ్ సిల్వర్ మెడల్ సాధించిన సందర్భంగా మార్నింగ్ కాఫీ క్లబ్ ఆధ్వర్యంలో శనివారం అభినందన సత్కారం నిర్వహించారు.

24న రమేష్ నాయుడు నామినేషన్

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం పట్టణానికి చెందిన కంచన ఛారిటబుల్ ట్రస్ట్ అధినేత కంచన రమేష్ నాయుడు ఈ నెల 24వ తేదీన ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన శనివారం విలేకర్లతో మాట్లాడుతూ ఈ నెల 24 తేదీ బుధవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో నరసాపురం అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను అందించనున్నట్లు తెలిపారు.

'జగన్ ఓ అబద్ధాల కోరు'

ప్రజాశక్తి - భీమవరం రూరల్

జగన్ ఓ అబద్ధాల కోరు అని, స్వేచ్ఛ వాయువులు పీల్చడానికి దేశం నుంచి బ్రిటిష్ వాళ్లను తరిమి కొట్టిన దాని కంటే మించి వైసిపి పారదోలడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణం రాజు విమర్శించారు. భీమవరంలోని ఆయన నివాసంలో శనివారం రచ్చబండ కార్యక్రమంలో భాగంగా ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జగన్ మళ్లీ గెలిస్తే రాష్ట్ర భవిష్యత్తు ఉండదన్నారు.

ఆర్‌టిసి ప్రయాణికులకు బహుమతులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

ఆర్‌టిసి బస్సుల్లో సురక్షిత ప్రయాణంతో పాటు ప్రోత్సాహక బహుమతులు కూడా ప్రతి 15 రోజులకు అందిస్తోందని అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్ ఎడిఎల్.సుధారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం, ఆచంట, గణపవరం, భీమవరం రూట్లలో ప్రయాణించినవారు తమ టికెట్ వెనుక పేరు, మొబైల్ నెంబర్ రాసి బస్సుల్లో ఉన్న గిఫ్ట్ బాక్స్‌లో వేయాలన్నారు. ఈ నెల మూడో తేదీ నుంచి 17 వరకు ప్రయాణించిన వారి టిక్కెట్లు శనివారం తాడేపల్లిగూడెం బస్‌స్టేషన్‌లో ప్రయాణికుల సమక్షంలో లక్కీ డీప్ నిర్వహించారు. లక్కీ డ్రా విజేతలకు బహుమతులను తాడేపల్లిగూడెం జివి మాల్ వారి సౌజన్యంతో అందిస్తున్నట్లు తెలిపారు.

'అవకాశవాదులను తరిమికొట్టండి'

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

నిలువెల్లా స్వార్థంతో రంగులు మారుస్తున్న అవకాశవాదులను తరిమి కొట్టాలని డిప్యూటీ సిఎం, వైసిపి తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ అన్నారు. స్థానిక 1, 2, 3, 4వ వార్డుల కూడలి ప్రాంతంలోని స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మంత్రి కొట్టు ప్రచార రథం పైనుంచి ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆక్వా డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం నాయుడు, కొలుకులూరి ధర్మరాజు పాల్గొన్నారు.

పెనుమంట్రగరువులో శ్రీరంగనాథరాజు ప్రచారం

పెనుమంట్ర :ఎన్నికల్లో వైసిపి ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థి చెరుకువాడ శ్రీరంగనాథరాజు కోరారు. మండలంలోని పెనుమంట్రగరువు గ్రామంలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లు అభ్యర్థించారు.

'రాష్ట్రాభివృద్ధే వైసిపి లక్ష్యం'

ప్రజాశక్తి - మొగల్తూరు

రాష్ట్రాభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా వైసిపి పాలన చేస్తుందని ఆ పార్టీ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి ముదునూరి ప్రసాదరాజు తనయుడు శ్రీకృష్ణంరాజు అన్నారు. మొగల్తూరు పంచాయతీ పరిధి నక్కావారిపేట, ఇంజేటివారిపేటలో ప్రజ ఆశీర్వాద కార్యక్రమంలో భాగంగా శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికీ వెళ్లి వైసిపి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ ప్రచారంలో నాయకులు పడవల సత్యనారాయణ, ఎస్సి సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకిలేటి ఆనంద్‌కుమార్, ఎస్సి సెల్ మొగల్తూరు మండలాధ్యక్షులు కోడెల్లి వెంకట్రావు, నాయకులు రేవు రాంబాబు, రామలక్ష్మి, దుర్గారావు, కోణాల ప్రసాద్, నరసాపురం మండల యూత్ అధ్యక్షులు చినిమిల్లి చందు, మొగల్తూరు మండల యూత్ అధ్యక్షులు యేగి బాబి, వర్ధనపు విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'బిసిల అభ్యున్నతికి కృషి'

ప్రజాశక్తి - పెనుమంట్ర

జాతీయ చేతివృత్తుల ఐక్యవేదిక పార్టీ ఆచంట ఎంఎల్ఎ అభ్యర్థిగా తాను పోటీ చేస్తున్నానని మార్టేరుకు చెందిన అల్లాడ సూర్యభాస్కరరావు తెలిపారు. శనివారం స్థానికంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23వ తేదీ మంగళవారం ఆచంట కేంద్రంలో నామినేషన్ వేయనున్నట్లు తెలిపారు. చేతివృత్తుల వారికి 50 ఏళ్లకే పెన్షన్ వచ్చేలా, పని చేసుకునే విధంగా వర్క్ షెడ్లు నిర్మించేలా కషి చేస్తానని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీలకు సంక్షేమ పథకాలు అమలు జరిగేలా చర్యలు చేపడుతానన్నారు. నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని చెప్పారు.

హుండీ ఆదాయం రూ.14.63 లక్షలు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం హుండీ ఆదాయాన్ని శనివారం లెక్కించామని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. గత 64 రోజులుగా యాత్రికులు అమ్మవారికి కానుకలు, మొక్కుబడుల రూపంలో హుండీలో సమర్పించుకున్న ఆదాయం రూ.14,63,735 సమకూరిందని ఆయన తెలిపారు. ఈ హుండీ ఆదాయాన్ని భీమవరం దేవాలయాల తనిఖీదారు వర్ధినిడి వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో లెక్కించామన్నారు. ఈ లెక్కింపులో పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసిపిలోకి చలంచర్ల సోదరులు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

పట్టణానికి చెందిన ఆర్యవైశ్య ప్రముఖులు చలంచర్ల మురళి, చలంచర్ల హరిప్రసాద్ ఇరువురు శనివారం డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ సమక్షంలో వైసిపిలో చేరారు. డిప్యూటీ సిఎం, తాడేపల్లిగూడెం ఎంఎల్ఎ అభ్యర్థి కొట్టు సత్యనారాయణ వీరికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ చలంచర్ల వారి కుటుంబాలతో తనకు బాల్యం నుంచి అనుబంధం ఉందన్నారు. తన బాల్యమిత్రుడు చలంచర్ల గుణేశ్వరావు కుమారులు మురళి, హరి ఇద్దరు కూడా వైసిపిలో చేరడం తనకు చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ యూత్ ప్రెసిడెంట్ చిటికెన ప్రసాద్, వైసిపి నాయకులు కొట్టు విశాల్, కొట్టు సూరిబాబు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - నరసాపురం


మాట్లాడుతున్న వైద్యురాలు పి.సోనియా

వేసవి కాలంలో ఎండ తీవ్రత వల్ల వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన ఆరోగ్యపరమైన జాగ్రత్తల గురించి న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక ఏరియా ఆసుపత్రి వైద్య సిబ్బంది అవగాహనా సదస్సు నిర్వహించారు. కోర్టు భవనాల సముదాయంలో శనివారం ఈ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్బన్ పిహెచ్‌సి వైద్యురాలు పి.సోనియా మాట్లాడుతూ ఎండాకాలంలో ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎండ సమయంలో ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, బయటకు రాకుండా ఉండాలన్నారు. నీరు ఎక్కువగా తీసుకోవాలని, చలువ చేసే ఆహారాన్ని తినాలని చెప్పారు. ఎండలో బయటకు రావాల్సి వస్తే కాటన్ దుస్తులు ధరించి, చెవులు, ముక్కుకు ఎండ తగలకుండా జాగ్రత్త వహించాలన్నారు. న్యాయవాదులు అడిగిన పలు ఆరోగ్యపరమైన సందేహాలను డాక్టర్ నివృత్తి చేశారు. అనంతరం న్యాయవాదులకు, కోర్టు సిబ్బందికి బిపి, డయాబెటిస్, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, సంస్థ ఛైర్మన్ పి.విజయదుర్గ, ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) ఆర్.వరలక్ష్మి, అదనపు సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కె.శ్రీనివాస్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు చల్లా దానయ్య నాయుడు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని కాపాడుకోవాలి

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి సత్యనారాయణ


కూలీలతో మాట్లాడుతున్న సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

ఉపాధి హామీ చట్టం కూలీలకు ఒక వరం వంటిదని, దానిని కాపాడుకోడానికి కూలీలు ఉద్యమించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ అన్నారు. ఉపాధి పర్యటనలో భాగంగా మండలంలోని మాధవరంలో వ్యవసాయ కార్మిక సంఘం శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కూలీలకు సమగ్రమైన చట్టం కావాలని 2005 ముందు ఎన్నో పోరాటాలు చేసి యుపిఎ ప్రభుత్వంపై వామపక్షాల ఒత్తిడితో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం సాధించారన్నారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా ఈ చట్టం అమల్లోకి వచ్చిందన్నారు. ఈ చట్టానికి కేంద్ర ప్రభుత్వం తూట్లు పొడుస్తుందన్నారు. దీనిని సమగ్రంగా అమలు చేసుకోవాలంటే కూలీల పోరాటాల ద్వారానే సాధ్యమన్నారు. కండెల్లి సోమరాజు మాట్లాడుతూ కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూలీలకు రోజుకు రూ.600 ఇవ్వాలని డిమాడ్ చేశారు. ఈ కార్యక్రమంలో కండెల్లి రమేష్‌బాబు, పి.లక్ష్మిసాదే, సంధ్య సాదే, ప్రశాంత్ కుమారి, లక్ష్మి, సాద్రా సత్యనారాయణ, గోపాల వెంకటరావు, గుత్తుల నరసయ్య పాల్గొన్నారు.

యూకేజీ విద్యార్థులకు స్నాతకోత్సవం

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఉల్లంపర్రు మాంటిస్సోరిస్ స్కూల్లో యూకేజీ (అప్పర్ కిండర్ గార్టెన్) విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులకు మాక్ కాన్వకేషన్ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుకెసి ఇంటర్నేషనల్ గవర్నర్ డాక్టర్ ముచ్చర్ల సంజయ్, విజయ మెడికల్ ల్యాబ్స్ సిఇఒ కొమ్ముల మురళీకృష్ణ, పాలకొల్లు లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ అరుణానాయుడు విచ్చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ముచర్ల మాట్లాడుతూ మాంటిస్సోరిస్ స్కూల్ గత 34 ఏళ్లుగా దినదినాభివృద్ధి చెందుతూ, విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడం, విద్యార్థులను మంచి క్రమశిక్షణలో పెడుతూ వారిని మంచి బాటలో తీసుకెళున్నామన్నారు. తల్లిదండ్రులు వారి అభిప్రాయాలను పిల్లలపై రుద్దకుండా వారికి దేనిపైన ఆసక్తి ఉందో గమనించి వారిని ఆ దిశగా అడుగులు వేసేలా చూడాలన్నారు. మరో అతిథి కొమ్ముల మురళీకృష్ణ మాట్లాడుతూ మాంటిస్సోరిస్ అంటే క్రమశిక్షణకు మారుపేరన్నారు. స్కూల్ అడ్మినిస్ట్రేటర్, డైరెక్టర్ శ్రీమద్దాల వాసు మాట్లాడుతూ స్కూల్ స్థాయిలో జరిగే ఈ మాక్ కాన్వకేషన్‌తో విద్యార్థులు భవిష్యత్తులో యూనివర్సిటీ స్థాయిలో కాన్వకేషన్ పాల్గొనడానికి ఆదర్శంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ సెక్రటరీ, కరెస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.వసంతలక్ష్మి పాల్గొన్నారు.

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రచారంలో కానూరి బుజ్జి

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ నరసాపురం ఎంఎల్ఎ అభ్యర్థి కానూరి ఉదయ భాస్కరకృష్ణప్రసాద్(బుజ్జి) అన్నారు. పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలో ఆయన శనివారం ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ ఎంతో మంది భూములు క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్ ఉపయోగించే రిజిస్ట్రార్ ఆఫీస్ సమస్యను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లిపూడి శ్రీను, మోకా శ్రీను, గుబ్బల కృష్ణారావు, సాధనాల పుల్లయ్య, సోడదాసి శ్రీధర్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో ప్రసవాలు సంఖ్య పెంచాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - మొగల్తూరు

ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిలో ప్రసవాలు సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు సిబ్బందికి సూచించారు. మొగల్తూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శనివారం సందర్శించారు. అనంతరం ఆర్‌సిఎం చర్చి ఆవరణలో నిర్వహిస్తున్న చిన్నారులకు టీకాలు వేసే కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. వడదెబ్బ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఒఆర్‌ఎస్ ప్యాకెట్లను ఆసుపత్రుల్లో, శిబిరాల వద్ద ప్రజలకు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు ఒ.దినేష్‌కుమార్, ఎంపి హెచ్ఒ ఎఎస్ఎన్.మూర్తి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు ఉన్నారు.

ముగిసిన అగ్నిమాపక వారోత్సవాలు

ప్రజాశక్తి - నరసాపురం

అగ్నిమాపక సిబ్బంది సేవలు ఎనలేనిని, ప్రాణాలు సైతం పక్కన పెట్టి ప్రజలను కాపాడతారని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా అగ్నిమాపక కార్యాలయంలో ఫైర్ ఆఫీసర్ కె.రామ్‌భాస్కర్ ఆధ్వర్యంలో గౌతమి పాఠశాల విద్యార్థులకు శనివారం అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ కె.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది వారం రోజుల పాటు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ ప్రజలను చైతన్య పరిచారని అభినందించారు. అనంతరం అగ్నిమాపక అధికారి కె.రామ్‌భాస్కర్ అగ్నిమాపక కేంద్రంలో ఉన్న వివిధ పరికరాలను విపత్తు సమయాల్లో ఏ విధంగా ఉపయోగించి తమ ప్రాణాలను రక్షించుకుంటూ, ప్రజల ప్రాణాలను ఎలా కాపాడాలో విద్యార్థులకు తెలిపారు.


ర్యాలీ నిర్వహిస్తున్న వికలాంగులు

వికలాంగుల ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భారత ఎన్నికల కమిషన్ ఓటింగ్ శాతం పెంచాలనే సంకల్పంతో వికలాంగులకు, 85 ఏళ్లు దాటిన వృద్ధులకు ఓటు వేసేందుకు ప్రత్యేక సౌకర్యం కల్పిస్తుందని సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి అన్నారు. ఇంటి వద్ద నుంచే ఓటు వినియోగించుకునేలా చేయడం శుభ పరిణామమన్నారు. దీనిపై వికలాంగులు హర్షం ప్రకటిస్తూ క్విట్ ఇండియా స్థూపం వద్ద శ్రీవిజ్ఞానవేదిక, రెవెన్యూ శాఖ అధ్వర్యంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. రంగసాయి మాట్లాడుతూ కలెక్టర్ సుమిత్ కుమార్ ఈ విషయంపై మరింత చొరవ కల్పిస్తున్నారన్నారు. రిటైర్డ్ పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు సీతారామరాజు, వెంకటరాజు మాట్లాడుతూ ఓటును ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. వికలాంగుల సంక్షేమ సంఘం నాయకులు నరికడమిల్లి లక్ష్మణరావు, దుర్గారావు, శ్రీనివాస్, నరహరిశెట్టి కృష్ణ పాల్గొన్నారు.

41 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి - నరసాపురం

మండలంలో 41 మంది వాలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ ఎంవి.రమణరావు తెలిపారు. మండలంలోని పలు సచివాలయాల్లో వాలంటీర్లు వ్యక్తిగత కారణాలు రీత్యా రాజీనామా చేసినట్లు ఎంపిడిఒ తెలిపారు.

క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేయాలి

నిబంధనల మేరకు అభ్యర్థుల వ్యయాల నమోదు

ఎన్నికల వ్యయ పరిశీలకులు భూటియా, మధుకర్, నారాయణ్

మాట్లాడుతున్న భూటియా, మధుకర్, నారాయణ్

ప్రజాశక్తి - ఏలూరు

ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల మేరకు నమోదు చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకులు షెరింగ్ జొర్డెన్ భూటియా, మేష్రమ్ గౌరవ్ మధుకర్, పి.కీర్తి నారాయణ్ అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అభ్యర్థుల ఎన్నికల వ్యయ నమోదుపై అధికారులతో వారు సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లాలో ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎన్నికల వ్యయం నమోదు చేసే విధానంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అభ్యర్థుల ఎన్నికల వ్యయం లెక్కింపు విధానంపై అధికారులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. అభ్యర్థులు ఎన్నికల సంఘం నిబంధన మేరకు గరిష్ట పరిమితికి మించి ఖర్చు చేస్తే అనర్హులవుతారని, ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనల ప్రకారం వ్యయాలను రిజిస్టర్లలో నమోదు చేసి, రోజువారీ నివేదికను సంబంధిత రిటర్నింగ్ అధికారులకు అదే రోజు అందించాలని అన్నారు. జిల్లాలో మద్యం అక్రమ రవాణాను నియంత్రించాలన్నారు. చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నిర్వహించే ర్యాలీలు, బహిరంగ సభలు, ఫ్లెక్సీ బ్యానర్లు, వినియోగించు వాహనాలు, తదితర అంశాలపై అభ్యర్థులు తెలియజేసిన వ్యయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ధారించుకోవాలన్నారు. వ్యయాలపై వ్యత్యాసాలుంటే వాటిని నివేదికల్లో తెలియజేయాలన్నారు. జిల్లా అదనపు ఎస్‌పి స్వరూపరాణి మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా 8 అంతరాష్ట్ర, అంతర్ జిల్లాల చెక్‌పోస్టుల్లో తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని, వీటిపై ప్రత్యేక నిఘా ఉంచామని చెప్పారు. చెక్ పోస్ట్ లు, తదితరాల దగ్గర స్వాధీనం చేసుకుని సీజ్ చేసిన నగదు, బంగారం, మద్యం వంటి వాటికి సంబంధించి ఆధారాలు అందించిన వారికి సొమ్ము, వస్తువులు అందించిన అంశాలపై జెడ్‌పి సిఇఒను పరిశీలకులు అడిగి తెలుసుకున్నారు. అక్రమ మద్యం, నాటుసారా తయారీ నియంత్రణపై స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్‌పి నక్కా సూర్యచంద్రరావు పరిశీలకులకు తెలియజేశారు. డిపిఒ తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్ మాట్లాడుతూ స్వీప్ కార్యక్రమాల ద్వారా ఓటర్ల అవగాహనకు చేపట్టిన కార్యక్రమాల వివరాలను పరిశీలకులకు వివరించగా జిల్లా యంత్రాంగాన్ని వారు అభినందించారు. అనంతరం ఓటర్ల అవగాహనపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలకులు పరిశీలించారు. సమావేశంలో ఉప రవాణా కమిషనర్ ఎస్.శాంతికుమారి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్ఎస్.కుమరేశ్వరన్, ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారి ఎన్.కుమార్‌మంగళ, అసిస్టెంట్ ట్రెజరీ అధికారి పి.పార్వతి, డాక్టర్ మోతే రమేష్ పాల్గొన్నారు.

24 గంటల వ్యవధిలో

18 లీటర్ల మద్యం, రూ.4 లక్షలు స్వాధీనం

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

24 గంటల వ్యవధిలో జిల్లా వ్యాప్తంగా 18 లీటర్ల మద్యం, రూ.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి మేరీప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఎనిమిది సరిహద్దు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికల విధులు చెక్‌పోస్టుల ద్వారా నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 19వ తేదీ సాయంత్రం ఏడు గంటల నుంచి 20వ తేదీ సాయంత్రం ఏడు గంటల వరకు రకరకాల చెక్ పోస్టుల ద్వారా పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా 18 లీటర్ల మద్యాన్ని, రూ.నాలుగు లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి మేరీప్రశాంతి తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతున్నాయని, ఎప్పటికప్పుడు వీడియో ద్వారా తనిఖీలను పర్యవేక్షిస్తున్నామని ఆమె తెలిపారు.

రూ.2.53 లక్షలు స్వాధీనం

ప్రజా శక్తి - కామవరపుకోట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వాహనాల తనిఖీల్లో భాగంగా శనివారం వేర్వేరు వ్యక్తుల నుంచి రూ.2.53 లక్షలు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల చెక్‌పోస్టు అధికారి మహమ్మద్ మొహిద్దీన్ తెలిపారు. మండలంలోని తాడిచర్ల గ్రామానికి చెందిన ఒక వ్యక్తి వద్ద నుంచి రూ.1.13 లక్షలు, పుట్లగట్లగూడెం గ్రామానికి చెందిన మరో వ్యక్తి వద్ద నుంచి రూ.1.40 లక్షలు స్వాధీనం చేసుకుని ఫ్లయింగ్ స్క్వాడ్ ఎఎస్ఐ స్వామికి అందించినట్లు మొహిద్దిన్ తెలిపారు. ఈ నగదును ఎన్నికల ట్రెజరీలో జమ చేస్తారని, తగిన ఆధారాలు చూపిస్తే నగదును వెనక్కి ఇస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ కె.రమేష్, కె.రామకృష్ణ, జి.సూర్యరావు, షేక్ నాగూర్, ఎం.నాగార్జున, సుధీర్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న నాయకులు

ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఇబ్బందులు

పాత మస్టర్ విధానాన్నే కొనసాగించాలి : వ్యకాస

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ఎన్ఎంఎంఎస్ యాప్ ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ, సిఐటియు మండల కార్యదర్శి ఇంజేటి శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని వెంప గ్రామంలో శనివారం ఉదయం వారు ఉపాధి హామీ పని ప్రాంతంలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్ఎంఎంఎస్ యాప్‌తో ఉదయం ఆరు గంటలకు ఫొటో తీసిన తర్వాత వేరొక చోట పని చేసి మళ్లీ ఉదయం తీసిన ఫొటో తీసిన ప్రదేశం వద్ద రెండో ఫొటో తీయడంతో పని చేసే వద్ద నుంచి మళ్లీ ఎండలో అక్కడికి వెళ్లేందుకు కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బడ్జెట్‌లో రూ.1.10 లక్షల కోట్లను రూ.60 వేల కోట్లకు తగ్గిస్తూ ఉపాధి హామీ చట్టాన్ని నీరు గార్చాలని చూస్తుందన్నారు. బడ్జెట్‌లో ఉపాధి హామీ చట్టానికి రూ.రెండు లక్షల కోట్లకు పెంచాలని, అడిగిన వారందరికీ పనులు చూపాలని, ఎన్ఎంఎంఎస్ యాప్ ఫొటో పద్ధతిని రద్దు చేసి పాత పద్ధతిలో మస్టర్ విధానాన్ని కొనసాగించాలని, పని ప్రదేశాల్లో మజ్జిగ, టెంట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మీసారపు ఇసాక్, మంద మార్తమ్మ, భూపతి శామేలు, నేతల కృపాదానం, వేంద్ర అమ్మాజీ శ్రీను, మంద చిట్టిబాబు, చిలకపాటి అబ్రహం, కొండేటి కుమారి, చిలకపటి శకుంతల, చిరంజీవి బేబి పాల్గొన్నారు.

ఇండియా వేదికతోనే అభివృద్ధి

ప్రచారంలో ఏలూరు ఎంపీ, ఎంఎల్ఎ అభ్యర్థులు

ప్రచారంలో ఏలూరు ఎంఎల్ఎ, ఎంపీ అభ్యర్థులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

దేశాన్ని, రాష్ట్రాన్ని కాపాడుకోవాలంటే త్యాగాల చరిత్ర కలిగిన పోరాట యోధులైన కమ్యూనిస్టులకు ఓటు వేసి గెలిపించాలని, ఇండియా వేదిక అభ్యర్థులను చట్ట సభలకు పంపాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, కాంగ్రెస్ పార్టీ ఏలూరు జిల్లా అధ్యక్షులు రాజనాల రామమోహనరావు పిలుపునిచ్చారు. సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా నగరంలోని 16వ డివిజన్ అరుంధతిపేట సిపిఐ స్తూపం వద్ద నుంచి ఏలూరు ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య, అసెంబ్లీ నియోజకవర్గ సిపిఐ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా కల్పించారు. ఆయా సెంటర్లలో ప్రజాసంఘాల నేతలు, ప్రజలు ఇండియా కూటమి అభ్యర్థులకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డేగా ప్రభాకర్, కృష్ణచైతన్య, రాజనాల రామమోహనరావు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వ పాలనలో రాజ్యాంగం, ప్రజాస్వామ్యం, లౌకిక తత్వం ప్రమాదంలో పడ్డాయని ఆందోళన వ్యక్తం చేశారు. విమానాశ్రయాలు, పోర్టులు, పరిశ్రమలు, ఇతర దేశ సంపద మొత్తాన్ని అదానీ, అంబానీలకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్రంలో మళ్లీ బిజెపి అధికారం లోకొస్తే దానికి ప్రత్యక్షంగా మద్దతిస్తున్న టిడిపిని, పరోక్షంగా మద్దతిస్తున్న వైసిపిని మింగేస్తుందన్నారు. త్యాగాలు చేసే కమ్యూనిస్టులను గెలిపించాలని కోరారు. నిత్యం ప్రజల మధ్య ఉండి సిపిఐ తరపున ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గానికి పోటీ చేస్తున్న బండి వెంకటేశ్వరరావుకు కంకి కొడవలి గుర్తుపై, కావూరి లావణ్యకు హస్తం గుర్తుపై ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ అభ్యర్థి కావూరి లావణ్య మాట్లాడుతూ తనను పార్లమెంటుకు గెలిపించి పంపితే ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్య పరిష్కారానికి చేస్తానని హామీ ఇచ్చారు. ఏలూరు అసెంబ్లీ అభ్యర్థి బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నగరంలో అపరిష్కృతంగా ఉన్న సమస్యలను పరిష్కరిస్తానన్నారు. ఈ ఎన్నికల ప్రచారంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ యామిని, ఎఐటియుసి ఏలూరు జిల్లా అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్ డాంగే, సిపిఎం నగర కార్యదర్శి పి.కిషోర్, శారద, దండుబోయిన చంద్రశేఖర్ పాల్గొన్నారు.

నర్సింగ్ విద్యార్థులకు వడదెబ్బపై అవగాహన అవసరం

అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి గోవిందరావు

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

నర్సింగ్ విద్యార్థులు వడదెబ్బ పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, తద్వారా వడదెబ్బ మరణాలు నివారించవచ్చని అసిస్టెంట్ మలేరియా నివారణ అధికారి జె.గోవిందరావు సూచించారు. స్థానిక ఏలూరు అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గజ్జలవారి చెరువుకు ట్రైనింగ్ నిమిత్తం వచ్చిన నర్సింగ్ విద్యార్థులకు వేసవికాలంలో ప్రజలు ఎక్కువగా ఎదుర్కొనే అనారోగ్య సమస్యల్లో ఒకటైన వడదెబ్బ గురించి అవగాహన కల్పించారు. ఎండలో పని చేయడం, దూర ప్రాంతాలకు ప్రయాణించడం వల్ల శరీరం నుంచి నీరు చెమట రూపంలో బయటకు పోవడంతో వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందన్నారు. ఎక్కువగా చిన్నపిల్లలు, గర్భిణులు, వయసులో పెద్దవారు వడదెబ్బ బారిన పడే అవకాశం ఉందని చెప్పారు. వడదెబ్బకు గురి కాకుండా చేయాల్సిన పనులు, చేయకూడని పనులు వివరించారు. అధిక వేడిలో పనిచేయరాదని, కాటన్ దుస్తులు ధరించాలని, తలపాగా, టోపీ, గొడుగు వినియోగించాలని, ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని సూచించారు. నీడ ప్రాంతంలో పనిచేసేలా వైద్య సిబ్బంది అవగాహన కల్పించాలని సూచించారు. వడదెబ్బకు గురైన వ్యక్తికి నర్సింగ్ విద్యార్థిగా చేయాల్సిన ప్రథమ చికిత్స గురించి, ఒఆర్ఎస్ ద్రావణం ఎలా కలపాలి, ఎంత కలపాలి, ఏ విధంగా తయారు చేయాలి, ఏ వయసుకి ఎంత తీసుకోవాలనే విషయాలపై, ఒఆర్ఎస్ ప్యాకెట్స్ లభించకపోతే ఇంటి వద్ద లభించే పదార్థాలతో ఏ విధంగా ఒఆర్ఎస్ ద్రావణం తయారు చేసుకోవచ్చని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి బాలకృష్ణ, ఆరోగ్య కార్యకర్తలు మహాలక్ష్మి భవాని, చిట్టిబాబు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సబ్‌జైలు సందర్శన

ప్రజాశక్తి - నరసాపురం

నరసాపురం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో సంస్థ ఛైర్మన్ ఆదేశాల మేరకు స్థానిక సబ్‌జైలును అదనపు సివిల్ జడ్జి జూనియర్ డివిజన్ కె.శ్రీనివాస్ సందర్శించి జైలు అదాలత్ నిర్వహించారు. జైలులో ఉన్న నిందితులను విచారించి వారి కేసు వివరాలు, న్యాయవాది వివరాలు అడిగి తెలుసుకున్నారు. న్యాయవాదిని పెట్టుకునే ఆర్థిక స్తోమత లేని నిందితులకు సంస్థ తరపున ఉచిత న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. బెయిల్ మంజూరు కాని నిందితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులకు అందుతున్న భోజన వసతుల గురించి ఆరా తీశారు. వంటశాలను, గిడ్డంగిని తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తితో పాటు ఉచిత న్యాయవాది కె.శిరీష, జైలు సూపరింటెండెంట్ టి.అప్పారావు పాల్గొన్నారు.

ప్రముఖ రంగస్థల కళాకారుడు పులఖండం ఉగాది మృతి

భీమవరం రూరల్ : ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి పున:నిర్మాణ కర్తల్లో ఒకరు ప్రముఖ రంగస్థలం సీనియర్ కళాకారుడు, నంది నాటక అవార్డు గ్రహీత శ్రీ పులఖండం ఉగాది (58) శుక్రవారం సాయంత్రం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఉగాది తన 16వ ఏటా నుంచే ఎన్నో నాటకాలు, నాటికలు, సినిమాలు, తెలుగు షార్ట్ ఫిలింలో నటిస్తూ ఎంతో పేరు తెచ్చుకున్నారు. గత రెండేళ్లుగా అనారోగ్యంతో ఉంటూ వైద్యం చేయించుకుంటున్నప్పటికీ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. ఆయన మృతి వార్త తెలిసిన వెంటనే పట్టణంలోని కళాకారులందరూ ఆయన ఇంటికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళులర్పించారు. ఉగాది మృతి పట్ల ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్య మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.సీతారాంప్రసాద్, గొన్నాబతుల మల్లేశ్వరరావు, చాంద్ బాషా, శాసనమండలి మాజీ సభ్యులు బొమ్మిడి నారాయణరావు, బివిఆర్ కళా కేంద్రం వ్యవస్థాపకులు బివి.రామారావు, రాయప్రోలు భగవాన్, జవ్వాది దాశరధి శ్రీనివాస్, గుండా రామకృష్ణ, చవ్వాకుల సత్యనారాయణ, తాళాబత్తుల వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి, వేల్పుల నాగేశ్వరరావు, పులగం నాగ నరసింహారావు, కాటి వెంకటరత్నం, పసుపులేటి సూర్యచంద్రరావు, పోశంశెట్టి మురళి, విపి.సుధాకర్, మహిళా కళాకారులు బొండాడ లక్ష్మి, ఉమా, రమణ సంతాపం తెలిపారు.